teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...


తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 170 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 18 డిసెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ‘5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.


## ఢాకాలో భారత వీసా కేంద్రం మూసివేత

- బంగ్లా హైకమిషనర్‌కు సమన్లు
- భద్రతా కారణాల దృష్ట్యా కీలక నిర్ణయం
- మధ్యాహ్నం నుంచి నిలిచిపోయిన సేవలు
- యూనస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని భారత్ అసహనం



05


## పార్టీ ఫిరాయించినట్లు ఆధారాలు లేవు

- ఐదుగురు ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్
- శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పష్టం
- అనర్హత పిటిషన్లు కొట్టివేత
- నేడు మరో ముగ్గురిపై రానున్న నిర్ణయం
- రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ



హైదరాబాద్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సంచలన తీర్పు వెలువరించారు. ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీపై అనర్హత వేటు వేయడానికి స్పీకర్ నిరాకరించారు. వీరు పార్టీ ఫిరాయించినట్లు ఎక్కడా ఆధారాలు లేవని స్పీకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. దీంతో

మిగతా 2 లో



## ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం కొరడా

### ఆ 9 టోల్ గేట్లు తక్షణమే మార్చండి

- ట్రాఫిక్ జామ్‌లే కాలుష్యానికి కారణమంటూ కోర్టు ఆగ్రహం
- ఎన్‌హెచ్‌ఏఐకి నోటీసులు జారీ
- ఉపాధి కోల్పోయిన వారి ఖాతాల్లో నగదు జమ

ఢిల్లీ ఎయిర్ పొలూష్యన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో పొలూష్యన్ కారణం అని పేర్కొంటూ ఢిల్లీలో ఉన్న 9 టోల్ గేట్లను మరో చోటుకు మార్చాలని ఆదేశించింది. ఢిల్లీలో వాయుకాలుష్య సంక్షోభంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇక ఢిల్లీలో వాయుకాలుష్యానికి ట్రాఫిక్ జామ్ లు కూడా ఓ కారణం అని పేర్కొన్న సుప్రీం కోర్టు. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఏఐకి సుప్రీంకోర్టు బుధవారం నోటీసులు ఇచ్చింది.

2




## ఏడు గ్రామాల్లో నో పోలింగ్

### మహబూబ్‌నగర్‌లో వింత పరిస్థితి


నామినేషన్లు లేక ఆగిపోయిన ఎన్నికలు

రిజర్వేషన్ చిక్కులే కారణం

.. వివరాలు 2లో

## ఓలా, ఉబెర్‌కు చెక్ జనవరి 1 నుంచి భారత్ ట్యాక్సీ

- సొంత క్యాబ్ యాప్‌తో ప్రైవేట్ దోపిడీకి అడ్డుకట్ట
- ఇప్పటికే 56 వేల మంది డ్రైవర్ల రిజిస్ట్రేషన్ పూర్తి
- సర్జ్ ప్రైసింగ్ లేకుండా సురక్షిత ప్రయాణం






## డేటా ఎందుకు డిలీట్ చేశారు..?

### ప్రభాకర్ రావుపై సిట్ ప్రశ్నల వర్షం

ముగియనున్న ప్రభాకర్ రావు కస్టడీ

సుప్రీంకోర్టుకు నివేదిక అందజేయనున్న సిట్

.. వివరాలు 2లో

## ఆదిలాబాద్‌లో అరెస్టులు అక్రమం

### మావోయిస్టు పార్టీ ఆగ్రహం

- సిర్పూర్ (యు) ఘటనపై జగన్ పేరిట లేఖ విడుదల
- అరెస్టైన 16 మంది క్షేమంపై ఆందోళన వ్యక్తం
- ప్రజాస్వామిక వాదులు స్పందించాలని పిలుపు



2




## ములుగు డీఆర్డీఏలో కోట్లాది నిధుల స్వాహా..?

- ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరిన వ్యవహారం
- రంగంలోకి దిగిన కలెక్టర్.. విచారణకు ఆదేశం
- అక్రమార్కుల గుండెల్లో మొదలైన గుబులు



ములుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ)లో గత కొన్నేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కోట్లాది రూపాయల నిధుల దుర్వినియోగం వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర స్థాయిని తాకింది. నిరుపేద మహిళా సంఘాల (ఎస్ హెచ్ జీ) అభ్యున్నతికి కేటాయించిన నిధులను, ఇతర పథకాల సొమ్మును పక్కదారి పట్టించారని ఆరోపిస్తూ దాఖలైన ఫిర్యాదుపై ముఖ్యమంత్రి కార్యాలయం మరియు జిల్లా కలెక్టర్ సీరియస్ గా స్పందించారు.



5



## రేవంత్ సర్కార్ మరో విద్యార్థిని బలిగొంది

- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- పోచంపాడ్ ఎస్సీ గురుకులంలో విషాదం
- సరైన వైద్యం అందక సాయి లిఖిత మృతి
- ఇప్పటికైనా సీఎం స్పందించాలి
- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్

.. వివరాలు 2లో



## అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ

- రాహుల్, రేవంత్‌లపై కేటీఆర్ ఫైర్
- బై ఎలక్షన్స్ అంటే కాంగ్రెస్‌కు భయం
- అందుకే ఫిరాయింపుదారుల రక్షణ: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీ సాక్షిగా బుధవారం ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ పార్టీ నిలువునా ఖూనీ చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. పెట్టారు. దేశ అత్యున్నత న్యాయస్థానాలపైనే

మిగతా 2 లో

## రాష్ట్రంపై చలి పంజా

- మరో నాలుగు రోజులు తీవ్రమైన కోల్డ్ వేవ్
- తెలంగాణలో 6 డిగ్రీలకు పడిపోనున్న ఉష్ణోగ్రతలు
- నగరంలో 7 డిగ్రీల కంటే తక్కువ నమోదయ్యే ఛాన్స్
- పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి
- తగు జాగ్రత్తలు తప్పనిసరి: వైద్యులు



# ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం కొరడా




న్యూ ఢిల్లీ, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ ఎయిర్ పొల్యూషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో పొల్యూషన్ కారణం అని పేర్కొంటూ ఢిల్లీలో ఉన్న 9 టోల్ గేట్లను మరో చోటుకు మార్చాలని ఆదేశించింది. ఢిల్లీలో వాయుకాలుష్య సంక్షోభంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇక ఢిల్లీలో వాయుకాలుష్యానికి ట్రాఫిక్ జామ్ లు కూడా ఓ కారణం అని పేర్కొన్న సుప్రీంకోర్టు. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఏఐకి సుప్రీంకోర్టు బుధవారం నోటీసులు ఇచ్చింది. ఢిల్లీలో వాయు కాలుష్య సమస్య ప్రతి సంవత్సరం పునరావృతం అవుతూనే ఉందని దీనికి పరిష్కారంగా దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించి దశల వారీగా అమలు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. వాయు కాలుష్య సమస్యను ఎదుర్కొనేందుకు తీసుకున్న దీర్ఘకాలిక చర్యలను కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ మళ్లీ సమీక్షించి, అమలులోకి తీసుకురావాలని ఆదేశించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించడంలో ఇప్పటివరకు అధికారులు తీసుకున్న చర్యలు పూర్తిగా విఫలమయ్యాయని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. పాఠశాలల మూసివేత విషయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఢిల్లీలో కాలుష్యం తగ్గించేందుకు భవన నిర్మాణాలపై ఆంక్షలు విధించడంతో ఆ కార్మికులు ఉపాధి లేక ఖాళీగా ఉన్నారని అందువల్ల ఆ భవన నిర్మాణ కార్మికుల ఖాతాల్లో నగదు వేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. భవన నిర్మాణ కార్మికులకు ఇతర పనులు చూపించాలంది. దీంతో భవన నిర్మాణ కార్మికుల ఖాతాల్లో నగదు వేస్తాయమని ఢిల్లీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఢిల్లీలో మొత్తం 2.50 లక్షల మంది కార్మికులు ఉన్నారని 7 వేల మంది కార్మికుల ఖాతాలే వెరిఫై అయినట్లు ఢిల్లీ సర్కార్ తెలిపింది.

# ఆదిలాబాద్‌లో అరెస్టులు అక్రమం

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం రోజు 16 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ అరెస్టులపై మావోయిస్టు పార్టీ స్పందిస్తూ కీలక లేఖను విడుదల చేసింది. జగన్ పేరుతో విడుదలైన ఈ లేఖలో పార్టీ కార్యకర్తల అరెస్టును భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సిర్పూర్ (యు) మండలంలోని కకర్ బుడ్డి, బాబ్జీ పేట గ్రామాల పరిసరాల్లో నిరాయుధులుగా ఉన్న తమ సహచరులను, గ్రామస్తులతో కలిపి మొత్తం 16 మందిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో వచ్చిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేయడానికే ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు.

**కోర్టులో హాజరుపరచాలని డిమాండ్**

మంగళవారం పోలీసులు అరెస్టు చేసిన వారందరినీ వెంటనే కోర్టులో హాజరుపరచాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాల కోసం, విపక్షాలు లేని దేశాన్ని నిర్మించేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని లేఖలో విమర్శించారు. ప్రజాస్వామిక వాదులు, మేధావులు, ఇతర రాజకీయ పార్టీలు ఈ అక్రమ అరెస్టులను ఖండించాలని, తెలంగాణలో శాంతియుత వాతావరణం కొనసాగేలా మద్దతు తెలపాలని పార్టీ విజ్ఞప్తి చేసింది. రాజ్యాంగబద్ధమైన సంస్థలను తమ కంట్రోల్‌లో పెట్టుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పాతర వేస్తున్నారని వారు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

# అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ

మొదటి పేజీ తరువాయి



కాదు చివరికి రాజ్యాంగంపై కూడా రాహుల్ గాంధీకి ఏమాత్రం గౌరవం లేదని మరోసారి తేలిపోయిందని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటికి వెళ్లి మరీ సీఎం రేవంత్ పార్టీ ఫిరాయింపులకు తెరతీసిన నాటి నుంచి నేటి స్పీకర్ నిర్ణయం వరకూ కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని అడుగడుగునా అపహాస్యం చేస్తూనే ఉందని మండిపడ్డారు. అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు సాక్షాత్తు ఫిరాయింపు ఎమ్మెల్యేలే అనేక సార్లు ప్రకటించినా వారిని కాపాడటం రాహుల్ గాంధీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనం. కేవలం ఫొటోలకు ఫోజులిచ్చేందుకు చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగితే సరిపోదు. తండ్రి చేసిన చట్టాన్నే గౌరవించలేని అసమర్థ నాయకుడిగా రాహుల్ గాంధీ చరిత్రలో మిగిలిపోతారని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెండేళ్ల పాలనా వైఫల్యాలపై పంచాయతీ ఎన్నికల్లో పల్లెపల్లెనా వెల్లువెత్తుతున్న ప్రజావ్యతిరేకతకు భయపడే కాంగ్రెస్ పార్టీ బై ఎలక్షన్స్ అంటే జంకుతోందని ఎద్దేవా చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్య తీసుకోకుండా వెనకడుగు వేయడానికి ప్రధాన కారణం ఇదేనని తెలంగాణ సమాజానికి స్పష్టంగా అర్థమైపోయింది. గోడ దూకిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తాత్కాలికంగా కాపాడినట్టు కాంగ్రెస్ అనుకున్నా ప్రజాక్షేత్రంలో వారిని ఎమ్మెల్యే పదవికి అనర్హులుగా ఆయా నియోజకవర్గాల ప్రజలు ఎప్పుడో ప్రకటించేశారని కేటీఆర్ పేర్కొన్నారు.

# రాష్ట్రంపై చలి పంజా

- మరో నాలుగు రోజులు తీవ్రమైన కోల్డ్ వేవ్
- తెలంగాణలో 6 డిగ్రీలకు పడిపోనున్న ఉష్ణోగ్రతలు
- నగరంలో 7 డిగ్రీల కంటే తక్కువ నమోదయ్యే ఛాన్స్
- పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి
- తగు జాగ్రత్తలు తప్పనిసరి: వైద్యులు





తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో పులి పంజా విసురుతోంది. అన్ని జిల్లాలతో పాటు హైదరాబాద్ నగరంలోనూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గతంతో పోలిస్తే నగరంలో చలి తీవ్రత భారీగా పెరిగిపోయింది. కాగా మరో నాలుగు రోజులు కూడా రాష్ట్రంలో కోల్డ్ వేవ్ ఉంటుందని వెదర్ మ్యాన్ ప్రకటించారు. ఉత్తర తెలంగాణ, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 6 నుండి 7 డిగ్రీలకు పడిపోతాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలో కొన్ని ప్రాంతాల్లో 7 నుండి 9 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇక ఇప్పటికే గత పదిరోజులుగా రాష్ట్రంలో కోల్డ్ వేవ్ కనిపిస్తోంది. అయితే రాబోయే నాలుగు రోజులు మాత్రం చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే చలి తీవ్రత పెరిగితే వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కువ ఇబ్బందిపడే అవకాశం ఉంది. కాబట్టి అలాంటివాళ్లు కాస్త జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# రేవంత్ సర్కార్ "మరో విద్యార్థిని బలిగొంది"



హైదరాబాద్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో మరో గురుకుల విద్యార్థిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం బలి తీసుకున్నదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పెట్టారు. నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ ఎస్సీ గురుకులంలో 8వ చదువుతున్న సాయి లిఖిత అనారోగ్యం బారిన పడినా సరైన సమయంలో చికిత్స చేయించలేదని కుటుంబ సభ్యులు చెప్తున్నారు.. చిన్నారి సాయి లిఖిత ఆరోగ్యం విషమించిన తర్వాత హైదరాబాద్‌కు తరలించినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రభుత్వ నిర్లక్ష్యం ఆమె తల్లిదండ్రులకు గర్భ శోకాన్ని మిగిల్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వంద మందికి పైగా గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు మృతిచెందారు. నిత్యం ఫుడ్ పాయిజన్‌తో పదుల సంఖ్యలో విద్యార్థులు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. వందమందికి పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం దారుణం. ఇకనైనా ముఖ్యమంత్రి స్పందించి గురుకులాల్లో మరో విద్యార్థి బలికాకుండా చర్యలు తీసుకోవాలి. సాయి లిఖిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కవిత డిమాండ్ చేశారు.


# పార్టీ ఫిరాయించినట్లు ఆధారాలు లేవు



మొదటి పేజీ తరువాయి

అనర్హత వేటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ఐదుగురు ఎమ్మెల్యేలకు భారీ ఊరట లభించినట్లైంది. కాగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ అంశంపై పలుమార్లు విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో స్పీకర్ తన నిర్ణయాన్ని బుధవారం ప్రకటించారు. కాగా ఈరోజు మరో ముగ్గురు ఎమ్మెల్యేలకు సంబంధించిన కేసులో స్పీకర్ తీర్పును ప్రకటించనున్నారు. అనర్హత పిటిషన్ల కేసులో రేపటితో సుప్రీంకోర్టు విధించిన గడువు ముగియనుంది.

# ఓలా, ఉబెర్‌కు చెక్ "జనవరి 1 నుంచి భారత్ ట్యాక్సీ"




న్యూ ఢిల్లీ, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): ప్రముఖ ప్రైవేట్ క్యాబ్ సేవల సంస్థలైన ఓలా, ఉబెర్ లకు ధీటుగా కేంద్ర ప్రభుత్వం జనవరి 1 నుంచి తన సొంత క్యాబ్ సర్వీస్ యాప్ 'భారత్ ట్యాక్సీ ని ప్రారంభించనుంది. ప్రస్తుతం ప్రైవేట్ క్యాబ్ సంస్థలు వసూలు చేస్తున్న అధిక ఛార్జీలు, క్యాన్సిలేషన్ సమస్యలు, సర్జ్ ప్రైసింగ్ (రద్దీ సమయంలో ఎక్కువ ధర) నుంచి ప్రయాణికులకు ఉపశమనం కలిగించడమే ఈ యాప్ ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వ పర్యవేక్షణ లో నడిచే ఈ యాప్ ద్వారా ప్రయాణికులకు తక్కువ ధరకే సురక్షితమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది.

**56 వేల మంది డ్రైవర్ల రిజిస్ట్రేషన్**

ఈ ప్రాజెక్టు పై కేంద్రం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. ఇప్పటివరకు సుమారు 56 వేల మంది డ్రైవర్లు భారత్ ట్యాక్సీ యాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రైవేట్ క్యాబ్ యాప్స్‌తో పోలిస్తే డ్రైవర్ల నుంచి వసూలు చేసే కమిషన్ తక్కువగా ఉండటం వల్ల, డ్రైవర్లకు ఎక్కువ ఆదాయం లభించడంతో పాటు ప్రయాణికులకు కూడా తక్కువ చార్జీలకే సేవలు అందే అవకాశం ఉంది. ఈ కొత్త విధానం రవాణా రంగంలో పారదర్శకతను పెంచడమే కాకుండా, సామాన్య ప్రయాణికులకు ఆర్థికంగా భారీ ఊరటనిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. అలాగే ముందస్తుగా రిజిస్టర్ అయిన డ్రైవర్లు అందుబాటులో ఉండటం తో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉంటాయి.

# ఏడు గ్రామాల్లో నో పోలింగ్




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో బుధవారం మూడో (తుది) విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఉత్సాహంగా జరిగాయి. కానీ మహబూబ్‌నగర్ జిల్లాలోని ఏడు గ్రామాల పరిస్థితి మాత్రం విభిన్నంగా ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని అమ్రాబాద్ మండలంలోని నల్లమల్ల షెడ్యూల్డ్ ప్రాంతానికి చెందిన ఈ ఏడు గ్రామాలు పంచాయతీలు ఎన్నికలకు నోచుకోలేదు. దీనికి ప్రధాన కారణం, ఈ గ్రామ పంచాయతీలకు నామినేషన్లు దాఖలు కాకపోవడం. ఈ ప్రాంతంలో ఓటర్లు లేకపోయినా, నిబంధనల ప్రకారం నల్లమల్ల షెడ్యూల్డ్ ప్రాంతంలో ఈ స్థానాలకు ఎస్టీ రిజర్వేషన్ కేటాయించారు. దీంతో ఎవరూ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేక అభ్యర్థులు నామినేషన్లు వేయలేదు. ఈ కారణంగా ఆ ఏడు గ్రామాలు పంచాయతీ ఎన్నికలకు దూరమయ్యాయి. కాగా ఈ పరిస్థితి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ఎస్టీ రిజర్వేషన్ల అమలు, షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ఓటర్లు, అభ్యర్థులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను, సవాళ్లను మరోసారి చర్చకు తీసుకు వచ్చింది.

# డేటా ఎందుకు డిలీట్ చేశారు..?

హైదరాబాద్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ ఆరో రోజు కూడా కొనసాగుతోంది. ఈ విచారణ నేటితో ముగియనున్న నేపథ్యంలో, సిట్ బృందం విచారణను మరింత వేగవంతం చేసింది. గత ఆరు రోజులుగా కొనసాగుతున్న ఈ ప్రక్రియలో ప్రధానంగా సాంకేతిక అంశాలతో పాటు, అప్పటి రాజకీయ నాయకుల ఫోన్లను ఏ విధంగా ట్యాపింగ్ చేశారనే కోణంలో అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అప్పటి ప్రభుత్వ పెద్దల నుంచి అందిన ఆదేశాల మేరకే ప్రభాకర్ రావు మరియు ఆయన బృందం ఈ ఫోన్ ట్యాపింగ్ కార్యకలాపాలకు పాల్పడినట్లు సిట్ ఇప్పటికే కీలక ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. విచారణలో భాగంగా ప్రభాకర్ రావు సెల్ ఫోన్లు ఫార్మాట్ చేయడంపై సిట్ బృందం గట్టిగా ప్రశ్నిస్తోంది. ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ నుండి అందిన నివేదికల ఆధారంగా అధికారులు విచారణను ముందుకు తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా వాట్సాప్ కాలింగ్, చాటింగ్ డేటా రిపోర్ట్‌లతో పాటు ఐపీ అడ్రస్‌ల ఆధారంగా సాక్ష్యాలను సేకరిస్తున్నారు. మీరు ఎలాంటి తప్పు చేయనప్పుడు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు మరియు క్లౌడ్ స్టోరేజ్‌లోని డేటాను ఎందుకు డిలీట్ చేయాల్సి వచ్చిందని అధికారులు ప్రభాకర్ రావును నిలదీస్తున్నారు. ఈ కస్టోడియల్ ఇన్వెస్టిగేషన్‌లో వెలుగు చూసిన అత్యంత కీలకమైన వివరాలు మరియు సేకరించిన సాక్ష్యాధారాలతో కూడిన పూర్తి స్థాయి నివేదికను రాష్ట్ర ప్రభుత్వం నేడు సుప్రీం కోర్టుకు సమర్పించనుంది. ప్రభాకర్ రావు ఇచ్చిన సమాచారం మరియు సిట్ సేకరించిన సాంకేతిక ఆధారాలు ఈ కేసులో తదుపరి పరిణామాలకు అత్యంత కీలకం కానున్నాయి. నేటితో కస్టడీ ముగియనుండటంతో, చివరి రోజు విచారణలో మరిన్ని కీలక విషయాలు బయటకు వచ్చే అవకాశం కనిపిస్తోంది.

# పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల పరిశీలన



ములుగు, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా బుదవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు డి. ప్రశాంత్ కుమార్ వాజేడు వాజేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, వాజేడు మండలంలోని చీకుపల్లి, గుమ్మడిదొడ్డి, చెరుకూరు, పెద్ద గొల్లగూడెం, కృష్ణాపురం, టేకులగూడెం, కొప్పుసురు, వెంకటాపురం మండలంలోని జెడ్ పి హెచ్ ఎస్, రంగరాజపురం కాలనీ, ఉప్పెడు వీరాపురం, టేకుల బోరు, పాత్ర పురం, వీరభద్రవరం, రామచంద్రపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగుతున్నట్లు ఆయన వివరించారు.

# కుష్టు వ్యాధిగ్రస్తులను ముందే గుర్తిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చు

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్**




మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): ఇంటింటి సర్వే ద్వారా కుష్టు వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించి చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 18 వ తేధి నుండి 31 వ తేధి వరకు నిర్వహిచే కుష్టు వ్యాధి కేసుల గుర్తింపు కార్యక్రమములో ఆశా కార్యకర్తలు గృహ సందర్శనలో వారి వారి క్షేత్రస్థాయిలో స్పర్శ లేని మచ్చలు గాని, రాగి వర్ణము కలిగిన మచ్చలు గాని ఉంటే అట్టి వ్యక్తులను సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రము వైద్యాధికారికి పంపించి నిర్ధారించాలని ఒకవేళ కేసును గుర్తిస్తే పూర్తి కాలము చికిత్స తీసుకునేటట్లు ఆశా కార్యకర్తలు వారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. గృహ సందర్శనలో ఆశా కార్యకర్తలు కుటుంబంలోని ఇంటి సభ్యులందరినీ క్షుణ్ణంగా పరీక్షించాలని పేర్కొన్నారు. కుష్టు వ్యాధి వంశ పారం పరంగా వచ్చే వ్యాధి కాదని, ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స ఉచితంగా లభిస్తుందని తెలిపారు.

# మూడో దశ పోలింగ్ విజయవంతం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): జిల్లాలో నిర్వహించిన రెండో సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికల మూడో దశ పోలింగ్ విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యిందని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మూడో దశలో భాగంగా కాటారం, మహాదేవ్‌పూర్, మహముత్తారం, మల్హర్రావు మండలాల్లో పోలింగ్ నిర్వహించగా, ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు దశలవారీగా ఓటింగ్ శాతం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. మూడో దశలో మొత్తం సగటు 84.02 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. కాటారంలో 82.28, మహదేవపూర్ లో 84.38, మహా ముత్తారంలో 86.42, మల్హర్ లో 83.80 పోలింగ్ జరిగినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయడంలో సహకరించిన అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి, పోలీస్ యంత్రాంగానికి, పాత్రికేయులకు అలాగే శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా ప్రజలందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మూడు దశలుగా నిర్వహించిన గ్రామ పంచాయితీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా పూర్తవడం ప్రజల సహకారం వల్లనే సాధ్యమైందని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే విధంగా ప్రజలు చూపిన బాధ్యతాయుత ప్రవర్తన ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు.

# పోలింగ్ తీరును, ఏర్పాట్లను పరిశీలించిన అబ్సర్వర్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

జనగాం జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): మూడవ విడత ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా కొనసాగుతుందని ఎన్నికల అబ్సర్వర్ రవి కిరణ్,జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మూడవ విడత ఎన్నికల నేపథ్యంలో దేవరుప్పుల, పాలకుర్తి మండలం లో పలు పోలింగ్ కేంద్రాలని ఎన్నికల అబ్సర్వర్, కలెక్టర్ బుధవారం సందర్శించి ఓటింగ్ సరళిని,పోలింగ్ ఏర్పాట్లు, ఓటు వేసేందుకు ఏర్పాటుచేసిన ఓటింగ్ కంపార్ట్మెంట్, లైటింగ్, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్, తదితర వివరాలను అలాగే పోలింగ్ కేంద్రాల పరిధిలో పరిస్థితులు, శాం తి భద్రతలు తదితర అంశాలను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి, ఓట్ల లెక్కింపునకు సంబంధించిన సూచనలు చేశారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు సంబంధిత అధికారులకు, పోలీస్ సిబ్బంది కి పలు సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీ ఓ, తహసీల్దార్ లు, ఎంపీడీఓ లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు


# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికల పోలింగ్

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

ములుగు జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా ముగిసింది. మూడు విడతలలోనూ ఎన్నికలు సజావుగా కొనసాగాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. మూడవ విడత పోలింగ్ బుధవారం ఉదయం 7.00 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. వాజేడులో విపరీతమైన మంచు కురుస్తున్నప్పటికీ చలిని సైతం లెక్క చేయకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు బారులు తీరారు. వెంకటాపురం, కన్నాయిగూడెం, వాజేడు మండలాల పరిధిలో ఓటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మూడవ విడతలో మొత్తం 46 సర్పంచ్ స్థానాలకు గాను, నామినేషన్ల ఉపసంహరణ నాటికే 01 స్థానం ఏకగ్రీవం అయ్యాయి. దీంతో మిగిలిన 45 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అదేవిధంగా మొత్తం 408 వార్డు స్థానాలకు గాను 79 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. వీటిని మినహాయిస్తూ, 329 వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మూడు మండలాల వ్యాప్తంగా 53,918 ఓటర్లు ఉండగా వారిలో 45,228 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని మూడవ విడతలో 83.88 శాతం పోలింగ్ నమోదయిందని తెలిపారు. మొదటి విడత ఎన్నికల్లో భాగంగా డిసెంబర్ 11వ తేదీన గోవిందరావుపేట,తాడ్వాయి ఏటూర్ నాగారం మూడు మండలాలలోని 39 సర్పంచ్ స్థానాలకు, 287 వార్డు మెంబర్స్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించామని, మూడు మండలాల వ్యాప్తంగా 60,361 ఓటర్లు ఉండగా వారిలో 47,472 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని మొదటి విడతలో 78.65 శాతం పోలింగ్ నమోదు కావడం జరిగిందని వివరించారు. రెండవ విడత ఎన్నికలలో భాగంగా డిసెంబర్ 14వ తేదీ న ములుగు, వెంకటాపూర్, మల్లంపల్లి మూడు మండలాలలోని 37 సర్పంచ్ స్థానాలకు, 315 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించామని మూడు మండలాల వ్యాప్తంగా మొత్తం 54,949 ఓటర్లు ఉండగా వారిలో 45,565 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని రెండవ విడతలో 82.93 శాతం పోలింగ్ నమోదు కావడం జరిగిందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 1306 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, భారీగా ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎక్కడికక్కడ ఓటింగ్ ఆవశ్యకతను వివరిస్తూ, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులచే ఓటు హక్కు పై అవగాహన కల్పించి, వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ఫొటోలతో కూడిన ఓటరు స్లిప్పులను పంపిణీ చేయడం, బీ.ఎల్.ఓలతో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి ఓటర్లకు వారి ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది అనే విషయాన్ని తెలియజేసేలా చర్యలు తీసుకోవడంతో ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటరు ఐ.డీ కార్డు లేని పక్షంలో ఎన్నికల సంఘం ధృవీకరించిన 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకదానిని చూపించి ఓటు వేయవచ్చని విస్తృత ప్రచారం చేయడం సత్ఫలితాలు ఇచ్చిందని కలెక్టర్ తెలిపారు. మొదటి విడత లో పోలింగ్ 78.65 శాతం, రెండో విడతలో పోలింగ్ 82.93 శాతం నమోదు కావడంతో, పోలింగ్ శాతం క్రమంగా పెరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మూడు విడతలలోనూ పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగిందని, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయించామని, వెబ్ క్యాస్టింగ్ జరిపించామని, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ తీరును నిశితంగా పరిశీలన చేశారని అన్నారు. కలెక్టరేట్ నుండి కూడా ఆయా పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్ తీరును, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయడంలో సహకరించిన అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి, పోలీస్ యంత్రాంగానికి, పాత్రికేయులకు అలాగే శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా ప్రజలందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మూడు దశలుగా నిర్వహించిన గ్రామ పంచాయితీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా పూర్తవడం ప్రజల సహకారం వల్లనే సాధ్యమైందని జిల్లా ఎన్నికల అధికారి అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే విధంగా ప్రజలు చూపిన బాధ్యతాయుత ప్రవర్తన ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు.

# అయ్యప్ప దీక్ష యువతను మంచి మార్గంలో నడిపిస్తుంది

**ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



మహబూబ్‌నగర్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): మహబూబ్‌నగర్ నగరంలోని పాత పాలమూరు శివశక్తి నగర్‌లో అయ్యప్ప స్వామి భక్తుల ఆధ్వర్యంలో శ్రద్ధాభక్తులతో ఘనంగా నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముందుగా అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు, ఆరాధనలు నిర్వహించి స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి దీక్ష అనేది కేవలం ఒక ఆచారం మాత్రమే కాదని, అది మనిషి జీవితాన్ని శుద్ధి చేసే గొప్ప ఆధ్యాత్మిక మార్గమని తెలిపారు. మండల కాలం పాటు అత్యంత నిష్ట, నియమాలతో కొనసాగించే ఈ దీక్షలో భక్తులు శారీరక శుద్ధితో పాటు మానసిక స్థైర్యం, ఆత్మనిగ్రహం, సహనం, సేవాభావం వంటి మహత్తర గుణాలను అలవరుచుకుంటారని అన్నారు. అయ్యప్ప స్వామి బోధనలు కుల, మత, వర్గ భేదాలను దాటి సమానత్వం, ఐక్యత, సోదరభావాన్ని చాటుతాయని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. స్వామియే శరణం అయ్యప్ప అనే నినాదం ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. దీక్షా కాలంలో భక్తులు పాటించే నియమాలు, స్వచ్ఛత, సత్యం, సద్బుద్ధి, నియమశీలత , సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు యువతను మంచి మార్గంలో నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, సమాజంలో శాంతి, సద్భావన, ధార్మిక చైతన్యాన్ని మరింత బలపరుస్తాయని ఎమ్మెల్యే గారు అన్నారు. ఈ మహా పడిపూజ కార్యక్రమంలో ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గురుస్వామి పి.ఎస్.రావు స్వామి, నాయకులు ఎల్లంగారి భరత్ కుమార్, ముక్రం, ఎల్లంగారి భరత్, ముక్రం, కుర్వ నరేష్, కుమార్, షకీల్, రాములు గురు స్వామి, బాలకిష్టయ్య గురుస్వామి పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పూర్తి అయిన మూడో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**పటిష్టమైన బందోబస్తు మధ్య కొనసాగుతున్న కౌంటింగ్ ప్రక్రియ**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనల మేరకు జిల్లాలో నిర్వహించిన మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్య స్ఫూర్తితో విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జిల్లా యంత్రాంగం ముందస్తుగా చేపట్టిన విస్తృత ఏర్పాట్లు, భద్రతా చర్యల కారణంగా పోలింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడో విడత ఎన్నికలలో భాగంగా జిల్లాలోని అల్లపల్లి, గుండాల, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి, సుజాతానగర్, టేకులపల్లి, యెల్లందు మండలాలలో పోలింగ్ నిర్వహించబడింది. జిల్లాలో మొత్తం 1,75,074 మంది ఓటర్లు నమోదు కాగా, పోలింగ్ ముగిసే సమయానికి 1,48,230 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో జిల్లాలో మొత్తం 84.67 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. పోలింగ్ ప్రారంభమైన ఉదయం నుంచే ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు హాజరయ్యారని తెలిపారు. ఉదయం 9.00 గంటల వరకు జిల్లావ్యాప్తంగా 37,231 ఓట్లు పోలవగా ఇది 21.27 శాతం పోలింగ్‌గా నమోదైందని, ఉదయం 11.00 గంటల వరకు 1,09,155 ఓట్లు పోలై 62.35 శాతం పోలింగ్ నమోదైందని చెప్పారు. మధ్యాహ్నం 1.00 గంటల వరకు మొత్తం 1,41,176 ఓట్లు పోలై 80.64 శాతం పోలింగ్ నమోదు కాగా, క్లోజ్ ఆఫ్ పోలింగ్ సమయానికి మొత్తం 1,48,230 ఓట్లు పోలై 84.67 శాతం పోలింగ్‌తో ఎన్నికలు ముగిశాయని కలెక్టర్ వివరించారు. మండలాల వారీగా పోలింగ్ శాతం పరిశీలిస్తే అల్లపల్లి మండలంలో 88.09 శాతం, గుండాల మండలంలో 86.25 శాతం, జూలూరుపాడు మండలంలో 88.71 శాతం, లక్ష్మీదేవిపల్లి మండలంలో 80.86 శాతం, సుజాతానగర్ మండలంలో 89.32 శాతం, టేకులపల్లి మండలంలో 86.47 శాతం, యెల్లందు మండలంలో 80.65 శాతం పోలింగ్ నమోదైందని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల సామగ్రి మరియు బ్యాలెట్ పేపర్లను అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్యగా సంబంధిత కౌంటింగ్ కేంద్రాలకు తరలించామని, ప్రస్తుతం కౌంటింగ్ ప్రక్రియ పోలీసు శాఖ, ఎన్నికల అధికారుల సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు మధ్య సజావుగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఉపయోగించిన ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పేపర్లు, సంబంధిత రికార్డులు అన్నింటినీ నిబంధనల ప్రకారం సీల్ చేసి స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు.

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మూడవ విడత పోలింగ్

## పోలింగ్ కేంద్రాల పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద




వరంగల్ జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): జిల్లాలో మూడవ విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల మూడవ విడత పోలింగ్ నేపథ్యంలో బుధవారం వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం నర్సంపేట మండలంలో లక్నేపల్లి ఇటుకాలపల్లి, పోలింగ్ కేంద్రాలు, ఖనాపూర్ మండలంలో ఖనాపూర్, రాగంపేట పోలింగ్ కేంద్రాలు, చెన్నారావుపేట మండలంలో ఉప్పరపల్లి, తిమ్మరాయనిపహాడ్ పోలింగ్ కేంద్రాలు, నెక్కొండ మండలంలో రెడ్లవాడ, ఆలంఖానిపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన హరిత ( గ్రీన్) పోలింగ్ కేంద్రాలతో పాటు పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలు, సిబ్బంది డ్యూటీల అమలు, పోలింగ్ సాగుతున్న విధానం, భద్రతా చర్యలు వంటి అంశాలను వివరంగా పరిశీలించారు. సమర్థవంతమైన పోలింగ్ నిర్వహణకు సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియలో ఏ విధమైన నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని, ప్రతి ఓటరికి సౌకర్యవంతమైన, అంతరాయం లేని వాతావరణం కల్పించడం సిబ్బందిపై నున్న ప్రధాన బాధ్యత అని అన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి పరిష్కరించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, పారదర్శకత, నిబంధనల ఖచ్చితమైన అమలు అత్యంత ఔచిత్యం కలదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటింగ్ శాతం పెంచాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ఎన్నికల సూచనల మేరకు జిల్లాలోని నాలుగు మండలాల్లో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి మండలానికి రెండు చొప్పున హరిత (గ్రీన్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొదటి, రెండవ విడతలలో హరిత పోలింగ్ కేంద్రాలలో మిగతా పోలింగ్ కేంద్రాల కంటే సుమారు 3 శాతం పోలింగ్ పెరిగిందని, గ్రీన్ పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు వల్ల ప్రజల్లో ఆసక్తి పెరుగుతోందని, తద్వారా పోలింగ్ శాతం మరింత పెరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మూడవ విడతలో ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నామని, నాలుగు మండలాల్లోని 110 సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 282 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలకు గాను 28 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, ఇతర పోలింగ్ స్టేషన్లలో వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా ఎప్పటికపుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడత లో పోలింగ్ 86 శాతం, రెండో విడతలో పోలింగ్ 88 శాతం నమోదు కావడంతో, పోలింగ్ శాతం క్రమంగా పెరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నాలుగు మండలాల్లో మొత్తం 102 గ్రామపంచాయతీలు, 809 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ నిర్వహణ జరుగుతోందని అన్నారు. 7 గ్రామపంచాయతీలు, 137 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని వెల్లడించారు. పోలింగ్ నిర్వహణకు సుమారు 4 వేల మంది సిబ్బందిని నియమించామని, ఇందులో 1500 మంది పోలీస్ సిబ్బంది, 2400 మంది పోలింగ్ అధికారులు, మైక్రో అబ్సర్వర్ల ,ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ తర్వాత మధ్యాహ్నం 2 నుండి కౌటింగ్ ప్రారంభమవుతుందని, ముందుగా వార్డుల కౌంటింగ్ , తర్వాత గ్రామపంచాయతీ లో సర్పంచ్ కౌంటింగ్ జరుగుతుందని వారన్నారు. మేజర్ గ్రామపంచాయతీలలో త్వరగా ఫలితాలు వచ్చేలా ఎక్కువ టేబుల్స్ ఏర్పాటు చేసి ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆర్వోలకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. మూడవ విడతలో 809 వార్డ్ స్థానాలను కౌంటింగ్ ఫలితాలు త్వరితంగా ఇచ్చుటకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ మరియు కౌంటింగ్ జరుగుటకు అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ అన్నారు. ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాం రెడ్డి, ఆర్డీఓలు ఉమారాణి, సుమా, నోడల్ అధికారులు, ఎంపిడీవోలు, తహశీల్దార్లు, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# క్రిస్మస్, న్యూ ఇయర్ వేళ జర భద్రం

## ఆఫర్ల పేరుతో సైబర్ వల

## పండుగ వేళ గిఫ్ట్‌ల లాంటి మెసేజ్‌లు వస్తే నమ్మకండి

## ఏపీకే ఫైల్స్ క్లిక్ చేయెుద్దు.. సైబర్ పోలీసుల హెచ్చరిక




హైదరాబాద్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): క్రిస్మస్, న్యూ ఇయర్ సందర్భంగా ప్రజలను దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు కాచుకుని ఉంటారని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు. గుర్తు తెలియని వారి నుంచి వచ్చే ఎస్ఎంఎస్ లు, వాట్సాప్ లలోని మెసెజ్ లు, లింక్ ల జోలికి వెళ్ళొద్దని సూచిస్తున్నారు. ముఖ్యంగా పండుగల వేళ డిస్కౌంట్ లు, లాటరీలు, గిఫ్ట్ లంటూ, భారీ ఆఫర్ లన్ని బురిడి కొట్టిస్తారని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కాబట్టీ ప్రజలు సోషల్ మీడియా వేదికగా జరిగే మోసాల పట్ల అలర్ట్ గా ఉండాలని పేర్కొంటున్నారు.

**మిమ్మల్ని ఆర్థికంగా దోచుకునే సైబర్ మోసాలు ఇలా**

- మీరు న్యూ ఇయర్, క్రిస్ట్ మస్ గిఫ్ట్ లు గెల్చుకున్నారు. మీకు ఫారిన్ లాటరీ నగదును గెల్చుకున్నారు. క్యాష్ బ్యాక్ ఆఫర్ ఉందని మెసేజ్ లు, లింక్ లు పంపిస్తారు. ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించాలని కోరుతారు.
- న్యూ ఇయర్ పార్టీ పేరుతో పేరొందిన పబ్స్, రిసార్ట్స్ పేర్లతో నకిలీ టికెట్ లు, పాసులు విక్రయిస్తారు. దీని కోసం ఫేక్ వెబ్ సైట్స్, పేజీలను రూపొందిస్తారు.
- షోషల్ మీడియా వేదికగా అతి తక్కువ ధరలకే అంతర్జాతీయ టూర్ లు, హాలీడే, ప్యాకేజీలు, ఆధ్యాత్మిక యాత్రలంటూ , క్రూజ్ షికార్లు అని అడ్వాన్సు లు అడుగుతారు. ఆ తర్వాత మాయమవుతారు.
- న్యూ ఇయర్ వేడుకలను దృష్టి లో పెట్టుకుని పేరొందిన హెూటల్స్, రిసార్ట్స్ తదితర టూరిస్ట్ ప్రాంతాలలో అతి తక్కువ ఖర్చు తో స్టే అంటూ సోషల్ మీడియా వేదికల మీదుగా నకిలీ వెబ్ సైట్ లు, పేజీలను రూపొందించి అడ్వాన్స్ లను వసూలు చేస్తారు.
- న్యూ ఇయర్ పార్టీల సందర్భంగా కారు, బైక్, కారు రెంటల్ సర్వీసెస్ అంటూ బుకింగ్ ల కోసం ముందస్తుగా డబ్బులు చెల్లించాలని ఆఫర్ లు ఇస్తారు.
- క్రిస్టమస్ సందర్భంగా పేదలకు, అనాథలకు లేదా చర్చిలకు డొనేషన్ లు అంటూ మాయ చేస్తారు.
- క్రిస్ట్ మస్ సందర్భంగా ఈవెంట్ లు, మాస్ ఎంట్రీ పాసులు, స్పెషల్ ఈవెంట్ రిజిస్ట్రేషన్స్ అంటూ ప్రకటనలను సోషల్ మీడియాలో గుప్పిస్తారు.
- హెూటల్ సర్వీసెస్, ఈవెంట్ మేనేజ్ మెంట్, ప్రమోషన్ ప్రోగ్రామ్స్ ల పేరుతో ఉద్యోగాలంటూ ఊరిస్తారు.
- న్యూ ఇయర్ సందర్భంగా క్యాష్ బ్యాక్ ఆఫర్ లు, బోనస్ లు, రివార్డు పాయింట్ లంటూ ఆశ పుట్టిస్తారు.
- ఎలాంటి ప్రకటనలు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చినప్పుడు అసలు నమ్మొద్దు. వాటిని క్లిక్ చేయెుద్దు. ఎవరికి ఓటీపీలు, పాస్ వర్డులు చెప్పొద్దు. ఏపీకే ఫైల్స్ ను ఓపెన్ చేయెుద్దు.
- అనుమానం రాగానే వాటిని డిలిట్ చేయాలి.
- మీరు అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టాలని పోలీసులు కోరుతున్నారు.

# సర్పంచుల 'అపాయింట్‌మెంట్ డే' వాయిదా

## ఈ నెల 22న కొలువుదీరనున్న కొత్త పాలకవర్గాలు

## ముహూర్తాల కారణంతో 20వ తేదీ కార్యక్రమం రద్దు

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల పదవి బాధ్యతలు స్వీకరించే అపాయింట్‌మెంట్ డే వాయిదా పడింది. ఈనెల 20న నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ శాఖ డిసెంబర్ 22కి మార్చింది. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యులు ఈ నెల 20న బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. అయితే సరైన ముహూర్తాలు లేవని కావున అపాయింటెడ్ డే ను ఈ నెల 22కు వాయిదా వేయాలని ప్రజా ప్రతినిధుల నుంచి పంచాయతీరాజ్ శాఖకు విజ్ఞప్తులు అందాయి. ఈ నేపథ్యంలో అపాయింట్‌మెంట్ డేను రెండు రోజుల పా టు వాయిదా వేసి, డిసెంబర్ 22న నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా నూతన సర్పంచులు అదే రోజు పదవి బాధ్యతలు స్వీకరించనున్నారు.



# చిన్నారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



గోవిందరావుపేట, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన కోసని శ్రీను మనవరాలు మొదటి పుట్టిన రోజు వేడుకలకు హాజరై చిన్నారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల రాధ-సుదర్శన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గనపాక సుధాకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెల్ల హరిప్రసాద్, మాజీ ఎంపీటీసీ చాపల ఉమాదేవి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొన్నం సాయి తేజ మరియు తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



హనుమకొండ జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): శాయంపేట, దామెర మండల కేంద్రాల్లోని గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం పరిశీలించారు. శాయంపేట మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి పోలింగ్ సరళి, ఓటింగ్ శాతం గురించి ఎన్నికల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా దామెర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వివరాలను ఎన్నికల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆయా మండలాల్లో రెండువేలకుపైగా ఓటర్లు ఉన్న పెద్ద గ్రామపంచాయతీలు ఉన్నచోట్ల నాలుగు టేబుల్స్ వేసి కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి కౌంటింగ్ కేంద్రాలలో ప్రారంభమయ్యే కౌంటింగ్ ప్రక్రియను అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ కు సంబందించిన అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డి ఆర్ డి ఓ మేన శ్రీను, పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ, మండల ప్రత్యేకాధికారులు జయంతి, బాలరాజు, ఎంపీడీవోలు ఫణి చంద్ర, కల్పన, తహసిల్దార్లు ప్రవీణ్ కుమార్, జ్యోతి వరలక్ష్మి దేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 10 గంటల ముందే ట్రైన్ రిజర్వేషన్ చార్ట్

## రైల్వే శాఖ కీలక నిర్ణయం

## 4 గంటల నిబంధనలో మార్పులు

## జోనల్ కార్యాలయాలకు రైల్వే బోర్డు ఆదేశాలు

## ప్రయాణికులకు ఊరట

## తగ్గనున్న చివరి నిమిషపు గందరగోళం




న్యూ ఢిల్లీ, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): రైల్వే శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు రైలు బయల్దేరే నాలుగు గంటల ముందు రిజర్వేషన్ చార్ట్ సిద్ధం చేస్తుండగా ఇకపై దాదాపు పది గంటల ముందుగానే చార్టును ఖరారు చేయాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా చార్ట్ ప్రిపరేషన్ షెడ్యూల్‌ను రైల్వే బోర్డు అప్‌డేట్ చేస్తూ అన్ని జోనల్ కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బయల్దేరే రైళ్లకు తొలి చార్టు ముందు రోజు రాత్రి 8 గంటలకల్లా సిద్ధం కానుంది. మధ్యాహ్నం 2.01 నుంచి రాత్రి 11.59 గంటల వరకు, అలాగే అర్ధరాత్రి 12 నుంచి ఉదయం 5 గంటల వరకు బయల్దేరే రైళ్లకు కనీసం 10 గంటల ముందే తొలి చార్టు సిద్ధం చేయనున్నారు. దీని వల్ల ప్రయాణికులు ముందుగానే టికెట్ స్థితిని తెలుసుకుని అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేసుకునే అవకాశం ఉండనుంది. దీనివల్ల చివరి నిమిషంలో ప్రయాణికుల గందరగోళం, టెన్షన్ తగ్గుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

# ఢిల్లీలో రాజ్యాంగం.. తెలంగాణలో ఉల్లంఘన

**కాంగ్రెస్ ద్వంద్వ నీతిపై హరీశ్ రావు ఫైర్**

**స్పీకర్ తీర్పుతో కాంగ్రెస్ రియల్ ఫేస్ బట్టబయలైందని విమర్శ**

**ఫిరాయింపు విషయంలో రాజ్యాంగాన్ని పరిహాసం చేసిందని ధ్వజం**



హైదరాబాద్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో స్పీకర్ తీర్పుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పరిహాసం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగంపై ఢిల్లీలో ఒక మాట తెలంగాణలో మరోమాట మాట్లాడుతోందని రాజ్యాంగంపై రాహుల్ నినాదం తెలంగాణలో వర్తించదా అని ప్రశ్నించారు. స్పీకర్ నిర్ణయంతో కాంగ్రెస్ ద్వంద్వ విధానం బట్టబయలైందన్నారు. ఢిల్లీలో రాజ్యాంగం పరిరక్షణపై మాట్లాడే కాంగ్రెస్ రియల్ ఫేస్ తెలంగాణలో స్పీకర్ తీర్పుతో బయటపడిందన్నారు. రాజకీయ లబ్ధి కోసం రాజ్యాంగ సంస్థలను కూడా దిగజార్చడం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి చెల్లిందన్నారు. పార్టీ మారిన ఎ్మటల్యేల విషయంలో ర్జాయంగం స్పష్టంగా నిర్దేశించిన యాంటీ-డిపెక్షన్ నియమాలను పూర్తిగా పక్కన పెట్టి అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం ఇది రాజ్యాంగాన్ని కాలరాయడమేనన్నారు. సేవ్ ది కానిస్టిట్యూషన్ నినాదం మాటలకే పరిమితమై, ఆచరణలో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని ఇది ఎంతో సిగ్గుచేటు. ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని అన్నారు.

# హైదరాబాద్‌కు చేరిన రాష్ట్రపతి

**శీతాకాల విడిది షురూ**

**హకీంపేట్‌లో ఘన స్వాగతం పలికిన గవర్నర్, మంత్రులు**

**22 వరకు బొల్లారం రాష్ట్రపతి నిలయంలోనే బస**



హైదరాబాద్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు చేరుకున్నారు. బుధవారం మధ్యాహ్నం హకీంపేట్ ఎయిర్‌పోర్ట్‌లో ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి స్వాగతం పలికారు. కాగా, శీతాకాల విడిదిలో భాగంగా డిసెంబంర్ 17 నుంచి 22వ తేదీ వరకు అంటే మొత్తం ఐదు రోజుల పాటు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ద్రౌపది ముర్ము బస చేయనున్నారు. డిసెంబర్ 19వ తేదీన రామోజీ ఫిలిం సిటీకి వెళ్లనున్నారు. ఆ రోజు ఉదయం 11.00 గంటలకు ఈ ఫిలిం సిటీ వేదికగా జరగనున్న ఆల్ ఇండియా పబ్లిక్ సర్వీస్ కమిషనర్ల జాతీయ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించనున్నారు. డిసెంబర్ 20వ తేదీన గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో జరిగే సదస్సుకు ముర్ము హాజరవుతారు. హైదరాబాద్‌లో రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో భద్రతకట్టుదిట్టం చేశారు. సైబరాబాద్ పరిధిలో డ్రోన్లు ఎగురవేతపై పోలీసులు ఆంక్షలు విధించారు. అల్వాల్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ల పరిధిలో 17నుంచి 22 వరకు డ్రోన్లు, పారా గ్లైడర్లు, రిమోట్ కంట్రోల్డ్ మైక్రో లైట్ ఎయిర్‌క్రాఫ్టుల ఎగురవేతపై నిషేధం విధించారు. భద్రతా చర్యల్లో భాగంగా బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

# తెలంగాణలో జనసేన విస్తరణే లక్ష్యం

**నేడు హైదరాబాద్‌లో కీలక సమావేశం**

**పవన్ ఆదేశాలతో కదిలిన శ్రేణులు**

**ఉమ్మడి 10 జిల్లాల నాయకులతో భేటీ**

**ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సన్నద్ధం**

**నేడే అభ్యర్థుల పేర్ల నమోదు**



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో జనసేన పార్టీని విస్తృతస్థాయిలో తీసుకువెళ్లాలని సూచించిన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఈరోజు కీలక సమావేశం నిర్వహించనున్నారు. తెలంగాణలోని ఉమ్మడి10 జిల్లాల పార్టీ శ్రేణులు మరియు గ్రేటర్ హైదరాబాద్ పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గం ఇన్చార్జిలు, పీఓసీ సభ్యులు, వివిధ పదవులల్లో ఉన్న నాయకులు, వీర మహిళలు, క్రియాశీలక వాలంటీర్లు వారి వారి నియోజకవర్గాల నుండి పార్టీ శ్రేణులు అందరూ పాల్గొనేలా బాధ్యత తీసుకొని ఈ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకత్వం ప్రకటన విడుదల చేసింది. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచులుగా, వార్డ్ మెంబర్లుగా జనసేన పార్టీ తరపున పోటీచేసి విజయం సాధించి ఈ సమావేశంలో సన్మానించనున్నారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించిన అభ్యర్థులు ఈ సమావేశంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచనలు చేశారు. ఆశావహులు అందరూ పాల్గొనాలని పేర్కొన్నారు.




# ములుగు డీఆర్డీఏలో కోట్లాది నిధుల స్వాహా..?

**ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరిన వ్యవహారం**

**రంగంలోకి దిగిన కలెక్టర్..**

**విచారణకు ఆదేశం**

**అక్రమార్కుల గుండెల్లో మొదలైన గుబులు**



ములుగు, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ)లో గత కొన్నేళ్ళుగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కోట్లాది రూపాయల నిధుల దుర్వినియోగం వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర స్థాయిని తాకింది. నిరుపేద మహిళా సంఘాల (ఎస్ హెచ్ జీ) అభ్యున్నతికి కేటాయించిన నిధులను, ఇతర పథకాల సొమ్మును పక్కదారి పట్టించారని ఆరోపిస్తూ దాఖలైన ఫిర్యాదుపై ముఖ్యమంత్రి కార్యాలయం మరియు జిల్లా కలెక్టర్ సీరియస్ గా స్పందించారు. ఈ మేరకు పూర్తి స్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ములుగు జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ను ఆదేశించడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

**అసలేం జరిగింది..?**

స్త్రీ నిధి మాజీ రీజనల్ మేనేజర్ ఎం. అరుణ్ సింగ్ నవంబర్ 4, 2025న ముఖ్యమంత్రికి మరియు అక్టోబర్ 14, 2025న ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్ కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. 2015-2020 మధ్య కాలంలో, అలాగే ఆ తదుపరి కాలంలో డీఆర్డీఏ ములుగు మరియు భూపాలపల్లి జిల్లాల పరిధిలో సుమారు రూ. 5 కోట్ల వరకు నిధుల దుర్వినియోగం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**ముఖ్యమైన ఆరోపణలు - కీలక అంశాలు:**

నిధుల మళ్లింపు: డీఎంయప్టి, ఈజీఎంఎం మరియు మార్కెటింగ్ కమిషన్ నిధుల నుండి సుమారు రూ. 2 కోట్లు దారి మళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు స్త్రీ నిధి రికవరీ, వడ్డీ లేని రుణాలు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ఇన్సూరెన్స్ నిధులకు సంబంధించి మరో రూ. 3 కోట్ల మేర దుర్వినియోగం జరిగినట్లు ఫిర్యాదులో వెల్లడించారు.

**అధికారుల సస్పెన్షన్.. పునఃప్రవేశం:**

గతంలో జరిగిన ప్రాథమిక విచారణలో నిధుల దుర్వినియోగం నిర్ధారణ అయ్యింది. దీనికి బాధ్యులుగా అప్పటి ఇంచార్జి డీఆర్డీవో సంజీవ రావును బదిలీ చేయగా, డి.పి.యం ఏ. సతీష్ ను సస్పెండ్ చేశారు. అయితే, సస్పెన్షన్ కాలంలో రాజకీయ అండదండలతో సతీష్ అనధికారికంగా విధులు నిర్వహించారని, పెండింగ్ ఎంక్వైరీ పేరుతో తిరిగి ములుగులోనే పోస్టింగ్ దక్కించుకున్నారని ఆరోపణలున్నాయి.

**రికార్డుల మాయం:**

తిరిగి పోస్టింగ్ పొందిన తరువాత, నిధుల దుర్వినియోగానికి సంబంధించిన సాక్ష్యాలను, పాత రికార్డులను సదరు అధికారి మాయం చేశారని లేదా నాశనం చేశారని అరుణ్ సింగ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐదేళ్లు గడుస్తున్నా నేటికీ విచారణ పూర్తి కాలేదని, ఒక్క రూపాయి కూడా రికవరీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**చిరుద్యోగులపై వేటు - పెద్దలకు పెత్తనం:**

గతంలో జరిగిన విచారణలో భాగంగా 21 మంది గ్రామ సంఘం అసిస్టెంట్లను తొలగించారు మరియు ముగ్గురు క్లస్టర్ కో-ఆర్డినేటర్ల ఇంక్రిమెంట్లు రద్దు చేసి సస్పెండ్ చేశారు. కానీ, ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు మాత్రం రాజకీయ పలుకుబడితో, లంచాలు ఎరజూపి కీలక పదవుల్లో కొనసాగుతున్నారన్నది ప్రధాన విమర్శ.

**బాధితుని ఆవేదన:**

అక్రమాలను ప్రశ్నించినందుకే తనపై కక్షగట్టి, అక్రమ కేసులు బనాయించి, మానసికంగా వేధించి ఉద్యోగం పోవడానికి కారణమయ్యారని మాజీ రీజనల్ మేనేజర్ అరుణ్ సింగ్ వాపోయారు. తనపై తప్పుడు ప్రచారాలతో సమాజంలో దోషిగా నిలబెట్టారని, దీని వెనుక ఒక 'ముఠా' పనిచేస్తోందని ఆయన సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

**తాజా పరిణామాలు:**

ఈ వ్యవహారంపై స్పందించిన ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, తక్షణమే విచారణ జరిపి, తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని ములుగు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ను ఆదేశించారు.

**డిమాండ్:**

పేద మహిళల సొమ్మును స్వాహా చేసిన వారిపై కేవలం శాఖాపరమైన చర్యలే కాకుండా, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, సీఐడీ లేదా విజిలెన్స్ విచారణ జరిపించి దుర్వినియోగమైన మొత్తాన్ని రికవరీ చేయాలని ఫిర్యాదుదారు కోరుతున్నారు.


# ఢాకాలో భారత వీసా కేంద్రం మూసివేత

**బంగ్లా హైకమిషనర్‌కు సమన్లు**

**భద్రతా కారణాల దృష్ట్యా కీలక నిర్ణయం**

**మధ్యాహ్నం నుంచి నిలిచిపోయిన సేవలు**

**యూనస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని భారత్ అసహనం**



న్యూ ఢిల్లీ, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): ఉగ్రవాదుల బెదిరింపులు, బంగ్లాదేశ్ నేతల రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పెరుగుతున్న భద్రతా సమస్యల మధ్య భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం బంగ్లా రాజధాని ఢాకాలో ఉన్న ఇండియన్ వీసా దరఖాస్తు కేంద్రాన్ని మూసివేసింది. భద్రతా పరిస్థితిని చూపిస్తూ మధ్యాహ్నం 2 గంటల నుంచి కార్యకలాపాలను నిలిపేసింది. బుధవారం షెడ్యూల్ అయిన అన్ని అపాయింట్మెంట్లను తర్వాత తేదీకి తిరిగి షెడ్యూల్ చేస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. దీనికి ముందు, భారత్‌లో బంగ్లాదేశ్ హైకమిషనర్ ఎం రియాజ్ హమీదుల్లాకు భారత విదేశాంగ శాఖ సమన్లు జారీ చేసింది. బంగ్లాలో క్షీణిస్తున్న భద్రతా పరిస్థితిపై తన ఆందోళనను తెలియజేసింది. ఢాకాలోని భారత మిషన్ భద్రతను కొందరు తీవ్రవాద శక్తులు టార్గెట్ చేయడంపై ఎంఈఏ బంగ్లా రాయబారిని పిలిచింది. మహ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని భారత్ తన ఆందోళన వ్యక్తం చేసింది. అంతకుముందు, బంగ్లాదేశ్ రాజకీయ నాయకుడు, నేషనల్ సిటిజన్ పార్టీ నేత హస్నత్ అబ్దుల్లా భారత్‌ను రెచ్చగొట్టే ప్రకటన చేశారు. తమ దేశాన్ని అస్థిరపరిస్తే భారత్ దేశంలోని ఈశాన్య రాష్ట్రాలను ఒంటరి చేస్తామని హెచ్చరించారు. ప్రతిఘటన అగ్ని సరిహద్దుల్ని దాటుతుందని హెచ్చరిస్తూ వ్యాఖ్యలు చేశారు.

# ఆపరేషన్ సిందూర్‌పై మహారాష్ట్ర మాజీ సీఎం వివాదాస్పద వ్యాఖ్యలు

**క్షమాపణలు చెప్పేది లేదని ప్రకటన**

**ముంబై, డిసెంబర్ 17 :** ఆపరేషన్ సిందూర్‌పై మహారాష్ట్ర మాజీ సీఎం పృథ్వీరాజ్ చవాన్ వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. అయితే తాను క్షమాపణలు చెప్పేది లేదని ఆయన ప్రకటించారు. పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేసిన ఆపరేషన్ సిందూర్ గురించి మహారాష్ట్ర మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చవాన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. పుణెలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో చవాన్ మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ మొదటి రోజే భారత్ యుద్ధ విమానాలను పాక్ కూల్చేసిందని సంచలన కామెంట్స్ చేశారు. తాజాగా తన వ్యాఖ్యలను ఆయన సమర్థించుకున్నారు. తన వ్యాఖ్యల్లో తప్పేమీ లేదని తేల్చి చెప్పారు. దీంతో, బీజేపీ నేతలు ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చవాన్ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఈ క్రమంలో తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ క్షమాపణలు చెప్పేది లేదని స్పష్టం చేశారు. పుణెలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ గురించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇవికాస్త రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. దీనిపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ మాట్లాడుతూ.. పృథ్వీరాజ్ చవాన్ పాకిస్థాన్ ప్రతినిధిలా మాట్లాడుతున్నారని విమర్శించారు. విజయ్ దివస్ నాడు మన సాయుధ దళాలను ఉద్దేశపూర్వకంగా దూషించి, వారిని రద్దు చేయాలంటూ వ్యాఖ్యానించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. చవాన్ వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలు ఎందుకు ఖండించలేదని, ఆయనపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సైన్యంపై గతంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు మందలించిన విషయాన్ని ప్రస్తావించారు. చవాన్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భాజపా రాజ్యసభ ఎంపీ బ్రిజ్‌లాల్ కూడా చవాన్ వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ ఎప్పుడూ పాక్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తూ.. భారత్‌ను అవమానిస్తుందని విరుచుకుపడ్డారు. ఇక, బీజేపీ నేతల ప్రతిస్పందనల క్రమంలో చవాన్ తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. 'ఇప్పుడు దీని గురించి నేను ఇంకేమీ చెప్పాలనుకోవడం లేదు. కానీ నేను ఎలాంటి క్షమాపణ చెప్పను. దాని అవసరం లేదు. నేను ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేయలేదని విలేకరులతో అన్నారు.

# హైబీపీ సమస్యతో బాధపడుతున్నారా..?

## అయితే ఈ సింపుల్ చిట్కాలను పాటించండి..!



ప్రస్తుత కాలంలో మనలో చాలా మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. వయసు పైబడిన వారిలోనే కాకుండా యువతలో కూడా మనం ఈ సమస్యను చూడవచ్చు. మారిన ఆహారపు అలవాట్లు, ఒత్తిడి, ఆందోళన, అధిక బరువు, శరీరానికి తగినంత శ్రమ లేకపోవడం, జన్యుపరమైన కారణాల వల్ల చాలా మంది అధిక రక్తపోటు బారిన పడుతున్నారు. ఒక్కసారి ఈ సమస్య బారిన పడితే ఇక ప్రతిరోజూ మందులు మింగాల్సిందే. అయితే ఇప్పుడు చెప్పే సాధారణ చిట్కాలను పాటించడం వల్ల రక్తపోటు నుండి బయటపడడమే కాకుండా భవిష్యత్తులో కూడా ఈ సమస్య బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. రక్తపోటును సహజంగా తగ్గించే చిట్కాల గురించి ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

**బరువు తగ్గాలి..**

అధిక రక్తపోటుతో బాధపడే వారు ముందుగా శరీర బరువును తగ్గించుకోవాలి. 3 నుండి 5 కిలోల బరువు తగ్గడం కూడా అధిక రక్తపోటుపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతుంది. అలాగే సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం వల్ల కూడా రక్తపోటును తగ్గించుకోవచ్చు. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, కొవ్వు తక్కువగా ఉండే పాల ఉత్పత్తులు, కొలెస్ట్రాల్ తక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తపోటుకు వాడే మందుల మోతాదును గణనీయంగా తగ్గించుకోవచ్చు. అదేవిధంగా రక్తపోటుతో బాధపడే వారు ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. రోజూ 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. రక్తపోటుతో బాధపడే వారు వారు తీసుకునే ఆహారంలో సోడియం తగ్గించుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

**మద్యం మానేయాలి..**

అధిక రక్తపోటు ఉన్నవారు రోజూ 1500 మిల్లీ గ్రాముల కంటే ఎక్కువగా సోడియంను తీసుకో కూడదు. ఇలా చేయడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు భవిష్యత్తులో కూడా రాకుండా ఉంటుంది. అంతేకాకుండా మద్యం సేవించడం వల్ల కూడా రక్తపోటు పెరుగుతుంది. రక్తపోటుతో బాధపడే వారు పూర్తిగా మద్యం తీసుకోవడం మానేయాలి లేదా మద్యం తీసుకోవడం తగ్గించాలి. ఇక కాఫీ తీసుకోవడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికి రక్తపోటు ఉన్నవారికి ఇది మంచిది కాదు. కాఫీ తీసుకోవడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. కనుక రక్తపోటుతో బాధపడే వారు కాఫీ తాగడాన్ని తగ్గించాలి.

**సరైన నిద్ర అవసరం..**

అదేవిధంగా నిద్రలేమి కారణంగా కూడా రక్తపోటు వస్తుంది. కనుక 6 నుండి 8 గంటలు కచ్చితంగా నిద్రించాలి. దీని వల్ల రక్తపోటు స్థాయిలు గణనీయంగా తగ్గుతాయి. ఒత్తిడితో బాధపడే వారిలో కూడా రక్తపోటు స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. కనుక రోజూ ధ్యానం, యోగా వంటివి చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. దీంతో రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇక ధూమపానం కూడా రక్తపోటు స్థాయిలను గణనీయంగా పెంచుతుంది. ఇది రక్తనాళాలకు కూడా హానిని కలిగిస్తుంది. కనుక రక్తపోటుతో బాధపడే వారు ధూమపానానికి పూర్తిగా దూరంగా ఉండడం మంచిది. ఈ విధమైన చర్యలను తీసుకోవడం వల్ల రక్తపోటు స్థాయిలు తగ్గడమే కాకుండా భవిష్యత్తులో కూడా రాకుండా ఉంటుందని వైద్యులు తెలియజేస్తున్నారు.



## విపరీతంగా చలి అనిపిస్తుందా?

# ఈ విటమిన్ లోపమే కారణం!

సాధారణంగా శరీర ఉష్ణోగ్రత.. రక్త ప్రసరణ, శక్తి ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. ఫలితంగా చేతులు, కాళ్ళు చల్లగా ఉంటాయి. తరచుగా చలిగా అనిపిస్తుంది. కాబట్టి, శీతాకాలంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా, జీవక్రియ అనేది శరీరంలో ఆహారాన్ని శక్తిగా మార్చే ప్రక్రియ. ఒక వ్యక్తి జీవక్రియ నెమ్మదిగా ఉన్నప్పుడు, శరీరం తగినంత వేడి, శక్తిని ఉత్పత్తి చేయలేకపోతుంది.

శరీరంలో రక్త ప్రసరణ సరిగ్గా పనిచేయనప్పుడు, తగినంత రక్తం చేతులు, కాళ్ళు, ఇతర అవయవాలకు చేరదు. రక్త ప్రవాహం తగ్గడం వల్ల, ఈ ప్రాంతాలలో ఉష్ణోగ్రత కూడా తగ్గుతుంది, దీనివల్ల ఎక్కువ చలిగా అనిపిస్తుంది. ఎక్కువసేపు కూర్చోవడం, శారీరక శ్రమ లేకపోవడం లేదా కొన్ని శారీరక పరిస్థితులు రక్త ప్రసరణను బలహీనపరుస్తాయి.

**ఏ విటమిన్ లోపం**

శరీరంలో ఎర్ర రక్త కణాల నిర్మాణంలో విటమిన్ బి12 ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఈ రక్త కణాలు శరీరంలోని ప్రతి భాగానికి ఆక్సిజన్‌ను తీసుకువెళతాయి. విటమిన్ బి12 లోపం ఉన్నప్పుడు, రక్తంలో తగినంత ఎర్ర రక్త కణాలు ఏర్పడవు, ఇది రక్తహీనతకు దారితీస్తుంది. దీని కారణంగా, శరీర కణాలకు అవసరమైన మొత్తంలో ఆక్సిజన్, వేడి అందదు. ఆపై శరీరం చల్లగా మారుతుంది.

ఇంకా, విటమిన్ డి రోగనిరోధక శక్తిని పెంచడంలో, శరీరంలో అంతర్గత ఉష్ణ సమతుల్యతను కాపాడుకోవడంలో సహాయపడుతుంది. విటమిన్ డి లోపం ఉన్నవారు జలుబు లేదా ఫ్లూ వంటి కాలానుగుణ వ్యాధులతో బాధపడే అవకాశం ఉందని వివిధ అధ్యయనాలు కనుగొన్నాయి. అంతే కాదు, విటమిన్ డి శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న థైరాయిడ్ గ్రంథి పనితీరును కూడా ప్రభావితం చేస్తుంది. థైరాయిడ్ సరిగ్గా పనిచేయకపోతే, శరీరం తక్కువ వేడిని ఉత్పత్తి చేస్తుంది, ఇది చలికి సున్నితత్వాన్ని పెంచుతుంది.

**ఎలాంటి ఆహారం తీసుకోవాలి?**

సాధారణంగా, శీతాకాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచడానికి పాలకూర, బీట్‌రూట్, గుడ్లు, చేపలు, చికెన్ పాలు, పెరుగు వంటి ఇనుము, బి12 అధికంగా ఉండే ఆహారాన్ని తినండి. అలాగే, సూప్ లేదా టీలో అల్లం, వెల్లుల్లిని జోడించడం వల్ల జీవక్రియ పెరుగుతుంది. శరీరం వెచ్చగా ఉంటుంది. బాదం, వాల్‌నట్స్, ఖర్జూర శక్తిని అందిస్తాయి. అలాగే జీలకర్ర, పసుపు, నల్ల మిరియాలు వంటి సుగంధ ద్రవ్యాలు మిమ్మల్ని లోపల నుండి వెచ్చగా ఉంచడానికి సహాయపడతాయి.



# శీతాకాలంలో ఇమ్యూనిటీ పెంచే అద్భుత పానీయం

శీతాకాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడం, రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడం చాలా ముఖ్యం. చలికాలంలో జలుబు, దగ్గు, వైరల్ జ్వరం వంటి వ్యాధులు త్వరగా రావచ్చు. అందువల్ల ఆయుర్వేద నిపుణులు శరీరాన్ని వెచ్చగా ఉంచే, వ్యాధితో పోరాడే సామర్థ్యాన్ని పెంచే పానీయాలు, ఆహారాలను తీసుకోవాలని సూచిస్తున్నారు.

**సూపర్ టానిక్**


ఈ పానీయం శీతాకాలానికి సూపర్ టానిక్ అని నిపుణులు అంటున్నారు. స్థానిక పదార్థాలను ఉపయోగించి ఈ పానీయం తయారు చేయవచ్చు. అలాగే, ఇది తాగడానికి పూర్తిగా సురక్షితం. ఈ సూపర్ టానిక్ డ్రింక్ తయారు చేయడానికి, మీకు ఒక పెద్ద గ్లాసు పాలు అవసరం. పాలు కాల్షియంకు అద్భుతమైన మూలం. ఇది ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. పాలలో తురిమిన అల్లం జోడించండి. తరువాత పసుపు, పతంజలి కేసరి, 1-2 చుక్కల తేనె వేసి కలపండి. దీని రంగు కాఫీని పోలి ఉంటుంది. పైన కొద్దిగా దాల్చిన చెక్క పొడి చల్లుకోండి. శీతాకాలంలో మీరు ఈ పానీయాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

పాలు తాగని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ పానీయాన్ని పాలు లేకుండా తయారు చేసుకోవచ్చు. ఒక గ్లాసు నీరు తీసుకుని, కొంచెం కుంకుమపువ్వు వేయండి. తరువాత, చిటికెడు అల్లం, చిటికెడు పసుపు, చిటికెడు దాల్చిన చెక్క పొడిని జోడించండి. తేనె వేసి త్రాగండి. ఇది రుచిగా ఉంటుంది మరియు రోగనిరోధక శక్తిని పెంచుతుంది మరియు శరీరానికి శక్తిని ఇస్తుంది.

# షుగర్ లెవల్స్ అధికంగా ఉన్నాయా..?

## అయితే వీటిని రోజూ మీ ఆహారంలో చేర్చుకోండి..!

మారిన జీవన విధానం కారణంగా తలెత్తే అనారోగ్య సమస్యలల్లో షుగర్ వ్యాధి కూడా ఒకటి. శారీరక శ్రమ లేకపోవడం, ఒత్తిడి, మారిన ఆహారపు అలవాట్ల కారణంగా వయసుతో సంబంధం లేకుండా అందరూ ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఒక్కసారి ఈ వ్యాధి బారిన పడితే జీవితాంతం మందులు వాడాల్సి ఉంటుంది. అంతేకాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం వల్ల మనకు ఇతరత్రా అనారోగ్య సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉంది. కనుక షుగర్ వ్యాధి బారిన పడి మందులు వాడడానికి బదులు ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. జీవన విధానాన్ని మార్చుకోవడంతో పాటు ఇప్పుడు చెప్పే పదార్థాలను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. షుగర్ వ్యాధి బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.




**కాబూలీ శనగలు..**

ఉడకబెట్టిన కాబూలీ శనగలను ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. కాబూలీ శనగలల్లో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంతో పాటు జీర్ణశక్తిని మెరుగుపరచడంలో, వాపులను తగ్గించడంలో కూడా సహాయపడుతాయి. చియా విత్తనాలను తీసుకోవడం వల్ల కూడా రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. వీటిలో అధికంగా ఉండే ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగించడంతో పాటు జీర్ణక్రియ నెమ్మదిగా జరిగేలా చేస్తుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అదేవిధంగా రాస్ప్ బెర్రీలను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ఫైబర్ తో పాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. ఇవి చక్కెర స్థాయిలను నియంత్రించడంలో దోహదపడతాయి.

**జామకాయలు..**

అదేవిధంగా పొట్టు మినపపప్పును ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. వీటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల చక్కెర స్థాయిలు అదుపులో ఉండడంతో పాటు జీర్ణశక్తి కూడా మెరుగుపడుతుంది. చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో జామకాయలు కూడా ఎంతగానో దోహదపడతాయి. వీటిలో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణశక్తిని మెరుగుపరచడంతో పాటు చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి.

**పాలకూర..**

పాలకూరను కూడా ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా ఉంటాయి. పాలకూరలో ఉండే ఫైబర్, విటమిన్స్, మినరల్స్ వంటి పోషకాలు చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయి. ఇక ముడిబియ్యాన్ని తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ఉండే ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో దోహదపడుతుంది. ఈ పదార్థాలను తరుచూ ఆహారంలో భాగంగా తీసుకుంటూ, వ్యాయామం వంటివి చేస్తూ ఉండడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చని, షుగర్ వ్యాధి మన దరిచేరకుండా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

# ఐపీఎల్ దెబ్బకు పీఎస్ఎల్ ఖాళీ

ఐపీఎల్ 2026 వేలం కారణంగా పాకిస్తాన్ సూపర్ లీగ్ (PSL)కు భారీ నష్టం వాటిల్లింది. పీఎస్ఎల్ జట్లలో కీలక సభ్యులుగా ఉన్న 11 మంది అంతర్జాతీయ ఆటగాళ్లను ఐపీఎల్ ఫ్రాంఛైజీలు దక్కించుకోవడమే దీనికి ప్రధాన కారణం. వీరి కోసం ఐపీఎల్ యాజమాన్యాలు మొత్తం రూ.27.3 కోట్లు వెచ్చించాయి. ఈ 11 మందిలో 10 మందిని వేలంలో కొనుగోలు చేయగా, మిచెల్ ఓవెన్‌ను పంజాబ్ కింగ్స్ రూ.3 కోట్లకు ముందే రిటైన్ చేసుకుంది. ఐపీఎల్, పీఎస్ఎల్ తదుపరి సీజన్లు ఒకే సమయంలో ప్రారంభమయ్యే అవకాశం ఉండటంతో, ఈ ఆటగాళ్లందరూ పీఎస్ఎల్‌ను వదులుకుని ఐపీఎల్‌లోనే ఆడే అవకాశం ఉంది. పీఎస్ఎల్ నుంచి ఐపీఎల్‌కు మారిన ఆటగాళ్లలో ఫిన్ అలెన్, జేసన్ హోల్డర్, టిమ్ సైఫర్ట్, మాథ్యూ షార్ట్, అకీల్ హోసేన్, కైల్ జేమీసన్, ల్యూక్ వుడ్, ఆడమ్ మిల్నే, జోర్డాన్ కాక్స్, బెన్ ద్వార్షుయిస్ వంటి ప్రముఖులు ఉన్నారు. వీరి చేరికతో ఐపీఎల్ జట్లు మరింత బలోపేతం కాగా, పీఎస్ఎల్ మాత్రం తన స్టార్ ఆటగాళ్లను కోల్పోయి కళ తప్పేలా కనిపిస్తోంది. ఆటగాళ్లు ఆర్థికంగా, క్రీడా పరంగా ఎంతో లాభదాయకమైన ఐపీఎల్‌కే మొదటి ప్రాధాన్యత ఇవ్వడం పీఎస్ఎల్ నిర్వాహకులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఈ వేలంలో ఏ ప్లేయర్‌ను ఏ టీమ్ కొనుగోలు చేసిందనే వివరాలను పరిశీలిస్తే.. క్వెట్టా గ్లాడియేటర్స్‌కు ఆడిన ఫిన్ అలెన్‌ను కేకేఆర్ రూ.2 కోట్లకు, అకీల్ హోసేన్‌ను సీఎస్‌కే రూ.2 కోట్లకు, కైల్ జేమీసన్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.2 కోట్లకు కొనుగోలు చేశాయి. ఇస్లామాబాద్ యునైటెడ్ నుంచి జేసన్ హోల్డర్‌ను గుజరాత్ టైటాన్స్ రూ.7 కోట్లకు, మాథ్యూ షార్ట్‌ను సీఎస్‌కే రూ.1.5 కోట్లకు, జోర్డాన్ కాక్స్‌ను ఆర్‌సీబీ రూ.75 లక్షలకు, బెన్ ద్వార్షుయిస్‌ను పంజాబ్ కింగ్స్ రూ.4.40 కోట్లకు దక్కించుకున్నాయి. కరాచీ కింగ్స్ నుంచి టిమ్ సైఫర్ట్‌ను కేకేఆర్ రూ.1.50 కోట్లకు, ఆడమ్ మిల్నేను రాజస్థాన్ రాయల్స్ రూ.2.40 కోట్లకు తీసుకున్నాయి. అలాగే పెషావర్ జల్మీకి ఆడిన ల్యూక్ వుడ్‌ను గుజరాత్ టైటాన్స్ రూ.75 లక్షలకు సొంతం చేసుకుంది. పీఎస్ఎల్, ఐపీఎల్ మధ్య తలెత్తిన ఈ చిక్కుముడికి ప్రధాన కారణం రెండు లీగ్‌ల షెడ్యూల్‌లు ఒకేసారి రావడం. నివేదికల ప్రకారం రెండు లీగ్‌లు మార్చి 26 నుండే ప్రారంభం కానున్నాయి. ఒకే సమయంలో రెండు లీగ్‌లు జరిగినప్పుడు, ఆటగాళ్లు సహజంగానే అత్యధిక ఆదాయం, క్రేజ్ ఉన్న ఐపీఎల్‌నే ఎంచుకుంటారు. ఈ 11 మంది ఆటగాళ్లు కూడా అదే బాటలో పయనిస్తూ పీఎస్ఎల్ తదుపరి సీజన్‌కు దూరం కానున్నారు. ఇది పీఎస్ఎల్ ఫ్రాంఛైజీలకు ఆటగాళ్ల ఎంపిక విషయంలో పెద్ద సవాలుగా మారనుంది.




**గుజరాత్ టైటాన్స్ పూర్తి జట్టు ఇదే**

జేసన్ హోల్డర్ (రూ.7 కోట్లు), అశోక్ శర్మ (రూ.90 లక్షలు),టామ్ బాంటన్ (రూ.2 కోట్లు), పృథ్వీరాజ్ యర్రా (రూ.30 లక్షలు), ల్యూక్ వుడ్ (రూ.75 లక్షలు). రిటెన్షన్స్: అనుజ్ రావత్, గ్లెన్ ఫిలిప్స్, గుర్నూర్ సింగ్ బ్రార్, ఇషాంత్ శర్మ, జయంత్ యాదవ్, జోస్ బట్లర్, కగిసో రబాడ, కుమార్ కుశాగ్రా, మానవ్ సుతార్, మహ్మద్ సిరాజ్, మహ్మద్ అర్షద్ ఖాన్, నిశాంత్ సింధు, ప్రసిద్ధ్ కృష్ణ, సాయి కిశోర్, రాహుల్ తెవాతియా, రషీద్ ఖాన్, సాయి సుదర్శన్, షారుక్ ఖాన్, శుభ్‌మన్ గిల్, వాషింగ్టన్ సుందర్.

**పంజాబ్ కింగ్స్ పూర్తి జట్టు ఇదే**

కూపర్ కునెలి (రూ.3 కోట్లు), బెన్ ద్వార్షుయిస్ (రూ.4.4 కోట్లు),ప్రవీణ్ దూబె (రూ.30 లక్షలు). రిటెన్షన్స్: అర్ష్‌దీప్ సింగ్, అజ్మతుల్లా ఒమర్జాయ్, హర్నూర్ పన్ను, హర్‌ప్రీత్ బ్రార్, లాకీ ఫెర్గూసన్, మార్కో యాన్సెన్, మార్కస్ స్టొయినిస్, మిచ్ ఓవెన్, ముషీర్ ఖాన్, నేహాల్ వధేరా, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాంశ్ ఆర్య, పైలా అవినాష్, శశాంక్ సింగ్, శ్రేయస్ అయ్యర్, సుర్యాంశ్ షెడ్గే, విష్ణు వినోద్, వైశాక్ విజయ్‌కుమార్, జేవియర్ బార్ట్‌లెట్, యశ్ ఠాకూర్, యుజ్వేంద్ర చాహల్.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ పూర్తి జట్టు ఇదే**

లియామ్ లివింగ్‌స్టోన్ (రూ.13 కోట్లు), సలీల్ అరోరా (రూ.1.5 కోట్లు), శివంగ్ కుమార్ (రూ.30 లక్షలు), సాకిబ్ హుస్సేన్ (రూ.30 లక్షలు), ఓంకార్ తర్మలే (రూ.30 లక్షలు), అమిత్ కుమార్ (రూ.30 లక్షలు), ప్రఫులే హింగే (రూ.30 లక్షలు), క్రెయిన్స్ (రూ.30 లక్షలు), శివమ్ మావి (రూ.75 లక్షలు). రిటెన్షన్స్: అభిషేక్ శర్మ, అనికేత్ వర్మ, బ్రైడన్ కార్స్, ఎషాన్ మలింగ, హర్ష్ దూబె, హర్షల్ పటేల్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, జయ్‌దేవ్ ఉనద్కత్, కమిందు మెండిస్, నితీశ్ కుమార్ రెడ్డి, పాట్ కమిన్స్, స్మరన్ రవిచంద్రన్, ట్రావిస్ హెడ్, జిషన్ అన్సారీ.

**రాజస్థాన్ రాయల్స్ పూర్తి జట్టు ఇదే**

రవి బిష్ణోయ్ (రూ.7.4 కోట్లు), ఆడమ్ మిల్నే (రూ.2.4 కోట్లు), సుశాంత్ మిశ్రా (రూ.90 లక్షలు), విఘ్నేష్ పుతుర్ (రూ.30 లక్షలు), యశ్ రాజ్ పుంజా (రూ.30 లక్షలు), రవి సింగ్ (రూ. 95 లక్షలు), అమన్ రావు (రూ.30 లక్షలు), బ్రిజేష్ శర్మ (రూ.30 లక్షలు), కుల్‌దీప్ సేన్ (రూ.75 లక్షలు). రిటెన్షన్‌లు: ధ్రువ్ జురెల్, డొనావన్ ఫెరీరా (ట్రేడ్), జోఫ్రా ఆర్చర్, క్వేనా మఫాకా, లువాన్ డ్రే ప్రిటోరియస్, నాండ్రీ బర్గర్, రవీంద్ర జడేజా (ట్రేడ్), రియాన్ పరాగ్, సామ్ కరన్ (ట్రేడ్), సందీప్ శర్మ, షిమ్రోన్ హెట్‌మయర్, శుభమ్ దూబె, తుషార్ దేశ్‌పాండే, వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్, యుధ్వీర్ చరక్.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు**

వెంకటేశ్ అయ్యర్ (రూ.7 కోట్లు), జాకబ్ డఫీ (రూ.2 కోట్లు),సాత్విక్ దేస్వాల్ (రూ.30 లక్షలు), మంగేశ్ యాదవ్ (రూ.5.2 కోట్లు), జోర్డాన్ కాక్స్ (రూ.75 లక్షలు), విక్కీ ఓస్త్వాల్ (రూ.30 లక్షలు), విహాన్ మల్హోత్రా (రూ.30 లక్షలు), కాన్షిక్ చౌహాన్ (రూ.30 లక్షలు). రిటెన్షన్స్: అభినందన్ సింగ్, భువనేశ్వర్ కుమార్, దేవ్‌దత్ పడిక్కల్, జాకబ్ బెతెల్, జితేశ్‌శర్మ, జోష్ హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్య, నువాన్ తుషార, ఫిల్ సాల్ట్, రజత్ పాటిదార్, రసిఖ్ దార్ సలామ్ , రొమారియో షెఫర్డ్, సుయాశ్ శర్మ, స్వప్నిల్ సింగ్, టిమ్ డేవిడ్, విరాట్ కోహ్లీ, యశ్ దయాళ్.

**ముంబయి ఇండియన్స్ పూర్తి జట్టు ఇదే**

క్వింటన్ డికాక్ (రూ.కోటి), డానిష్ మలేవార్ (రూ.30 లక్షలు), మహ్మద్ ఇజార్ (రూ. 30 లక్షలు), అథర్వ అంకోలేకర్ (రూ. 30 లక్షలు), మయాంక్ రావత్ (రూ. 30 లక్షలు). రిటెన్షన్స్: అల్లా ఘజన్‌ఫర్, అశ్వనీ కుమార్, కార్బిన్ బాష్, దీపక్ చాహర్, హార్దిక్ పాండ్య, జస్‌ప్రీత్ బుమ్రా, మయాంక్ మార్కండే (ట్రేడ్), మిచెల్ శాంట్నర్, నమన్ ధీర్, రఘు శర్మ, రాజ్ అంగద్ బావా, రాబిన్ మింజ్, రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్‌టన్, శార్దూల్ ఠాకూర్ (ట్రేడ్), షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (ట్రేడ్), సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, ట్రెంట్ బౌల్ట్, విల్ జాక్స్.

**దిల్లీ క్యాపిటల్స్ పూర్తి జట్టు ఇదే**

బెన్ డకెట్ (రూ.2 కోట్లు), డేవిడ్ మిల్లర్ (రూ.2 కోట్లు), అకిబ్ నబీ (రూ.8.4 కోట్లు), పాథుమ్ నిశాంక (రూ.5 కోట్లు), లుంగి ఎంగిడి (రూ.2 కోట్లు), పృథ్వీ షా (రూ.75 లక్షలు), సాహిల్ పరేఖ్ (రూ.30 లక్షలు), కైల్ జేమిసన్ (రూ.2 కోట్లు). రిటెన్షన్స్: అభిషేక్ పోరెల్, అజయ్ మండల్, అశుతోష్ శర్మ, అక్షర్ పటేల్, దుష్మంత చమీర, కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్, కుల్‌దీప్ యాదవ్, మాధవ్ తివారీ, మిచెల్ స్టార్క్, ముకేశ్ కుమార్, నితీష్ రాణా (ట్రేడ్), సమీర్ రిజ్వీ, టి. నటరాజన్, త్రిపురణ విజయ్, ట్రిస్టన్ స్టబ్స్, విప్రాజ్ నిగమ్.

**కోల్‌కతా నైట్‌రైడర్స్ పూర్తి జట్టు ఇదే**

కామెరూన్ గ్రీన్ (రూ. 25.20 కోట్లు), ఫిన్ అలెన్ (రూ. 2 కోట్లు), తేజస్వి సింగ్ (రూ. 3 కోట్లు), మతీశ పతిరన (రూ.18 కోట్లు), ముస్తాఫిజుర్ రెహ్మాన్ (రూ. 9.2 కోట్లు), టిమ్ సీఫెర్ట్ (రూ. 1.5 కోట్లు), ప్రశాంత్ సోలంకి (రూ. 30 లక్షలు), కార్తీక్ త్యాగి (రూ. 30 లక్షలు), రాహుల్ త్రిపాఠి (రూ. 75 లక్షలు), సార్థక్ రంజన్ (రూ. 30 లక్షలు), దక్ష్ కమ్రా (రూ. 30 లక్షలు), రచిన్ రవీంద్ర (రూ. 2 కోట్లు), ఆకాశ్ దీప్ (రూ. 1 కోటి).రిటెన్షన్స్: అజింక్య రహానె, అంగ్‌క్రిష్ రఘువంశీ, అనుకుల్ రాయ్, హర్షిత్ రాణా, మనీష్ పాండే, రమణ్‌దీప్ సింగ్, రింకు సింగ్, రోవ్‌మన్ పావెల్, సునీల్ నరైన్, ఉమ్రాన్ మాలిక్, వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి.

**లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ పూర్తి జట్టు ఇదే**

ముకుల్ చౌదరి (రూ.2.6 కోట్లు), వానిందు హసరంగా (రూ.2 కోట్లు), అన్రిచ్ నోకియా (రూ.2 కోట్లు), నమన్ తివారీ (రూ.కోటి), అక్షత్ రఘువంశీ (రూ.2.2 కోట్లు), జోష్ ఇంగ్లిస్ (రూ.8.6 కోట్లు). రిటెన్షన్స్: అబ్దుల్ సమద్, ఐదెన్ మార్‌క్రమ్, ఆకాశ్ సింగ్, అర్జున్ టెండూల్కర్ (ట్రేడ్), అర్షిన్ కులకర్ణి, అవేశ్ ఖాన్, ఆయుష్ బదోని, దిగ్వేష్ రాఠీ, హిమ్మత్ సింగ్, మణిమారన్ సిద్ధార్థ్, మాథ్యూ బ్రీట్జ్కే, మయాంక్ యాదవ్, మహ్మద్ షమీ (ట్రేడ్), మిచెల్ మార్ష్, మోసిన్ ఖాన్, నికోలస్ పూరన్, ప్రిన్స్ యాదవ్, రిషభ్ పంత్, షాబాజ్ అహ్మద్.

**చెన్నై సూపర్ కింగ్స్ పూర్తి జట్టు ఇదే**

కార్తీక్ శర్మ (రూ. 14.20 కోట్లు), ప్రశాంత్ వీర్ (రూ.14.20 కోట్లు), అకీల్ హోసేన్ (రూ.2 కోట్లు), మాథ్యూ షార్ట్ (రూ.1.5 కోట్లు), అమన్ ఖాన్ (రూ.40 లక్షలు), సర్ఫరాజ్ ఖాన్ (రూ.75 లక్షలు), మాట్ హెన్రీ (రూ.2 కోట్లు), రాహుల్ చాహర్ (రూ.5.2 కోట్లు), జాక్ ఎడ్వర్డ్స్ (రూ.3 కోట్లు), జాక్ ఫౌల్క్స్ (రూ.75 లక్షలు). రిటెన్షన్స్: అన్షుల్ కాంబోజ్, గుర్జప్నీత్ సింగ్, జేమీ ఓవర్టన్, ఎంఎస్ ధోనీ, ముకేష్ చౌదరి, నాథన్ ఎల్లిస్, నూర్ అహ్మద్, రామకృష్ణ ఘోష్, సంజు శాంసన్ (ట్రేడ్), రుతురాజ్ గైక్వాడ్, శివమ్ దూబె, శ్రేయస్ గోపాల్, ఖలీల్ అహ్మద్, ఆయుష్ మాత్రే, డెవాల్డ్ బ్రెవిస్, ఉర్విల్ పటేల్.

## సూర్యకుమార్ ఒక్కడే ఒంటి చేత్తో సిరీస్‌లు గెలిపించగలడు

**శివం దూబే కీలక వ్యాఖ్యలు**



మరికొన్ని రోజుల్లో టీ20 వరల్డ్ కప్ ఉండగా టీమిండియాపై ఒత్తిడి పెరుగుతోంది. అందుకు కారణంగా ఇద్దరు స్టార్ బ్యాటర్లు వరుసగా విఫలం కావడమే. ముఖ్యంగా ఓపెనర్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ లను వరుస వైఫల్యాలు వెంటాడుతున్నాయి. ఆల్ రౌండర్ శివమ్ దూబే, ఫామ్ లో లేని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కు మద్దతుగా నిలిచాడు. టీ20 కెప్టెన్ అయిన సూర్యకుమార్ మ్యాచ్ విన్నర్ అని.. అతడు ఒంటరిగా మ్యాచ్ గెలిపించగల బ్యాటర్ అని, సరైన సమయంలో ఫామ్ లోకి వస్తాడని దీమా వ్యక్తం చేశాడు. సూర్యకుమార్ చివరి టీ20 హాఫ్ సెంచరీ అక్టోబర్ 2024లో చేశాడు. ప్రపంచ కప్ నకు రెండు నెలల కంటే తక్కువ సమయం ఉండటంతో స్కైపై ఒత్తిడి పెరుగుతోంది. దక్షిణాఫ్రికాతో జరిగిన నాల్గవ టీ20 మ్యాచ్ కు కొన్ని గంటల ముందు దూబే మాట్లాడుతూ.. "సూర్యపై మాకు నమ్మకం ఉంది. అతడు ఒక్కడే 5 మ్యాచ్ లు గెలిపించగలడు. ఫామ్ లో లేకపోతే అతను మంచి ఆటగాడు కాదని అనలేం. ఒంటి చేత్తో భారత్‌కు విజయాలు అందించగల టాలెంట్ అతడి సొంతం" అన్నాడు. "అతను అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడు. అతడి గణాంకాలు చూస్తే మీకే తెలుస్తుంది. అవును, ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ పరుగులు బ్యాట్ నుంచి పరుగులు రావడం లేదు. కానీ సరైన సమయంలో అతను ఫామ్ లోకి వస్తాడు. ఏ క్షణంలోనైనా బిగ్ ఇన్నింగ్స్ ఆడగలడు. సూర్య ఓ యోధుడు. అతను పరుగులు చేసినా చేయకపోయినా, మంచి ఆటగాడు. ఎల్లప్పుడూ జట్టు కోసం ఏదైనా చేయాలనుకుంటాడు. అతను చాలా దూకుడుగా ఆడే బ్యాటర్, ఇంకా చెప్పాలంటే 360 డిగ్రీల బ్యాట్స్ మన్" అని శివం దూబే అన్నాడు. వైస్ కెప్టెన్ శుభమన్ గిల్ కూడా ఫామ్ లో లేడు, కానీ అతడు సైతం బెస్ట్ ఓపెనర్, బెస్ట్ బ్యాటర్ అని శివం దూబే అతనిపై కూడా నమ్మకం ఉంచాడు. "శుభమన్ గిల్ ఒక మంచి ఆటగాడు. ఫామ్ ఉన్నా, లేకపోయినా అతని సగటు, స్ట్రైక్ రేట్ బాగుంటాయి. గత కొన్నేళ్లుగా గిల్ భారతదేశం కోసం మంచి ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. ఏ ప్లేయర్ కైనా ఆటలో హెచ్చు తగ్గులు సహజం. కానీ అతను భారతదేశపు అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడన్నది వాస్తవం" అన్నాడు. దక్షిణాఫ్రికా చేతిలో టెస్ట్ సిరీస్ ఓడినా, వన్డే సిరీస్ నెగ్గి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ప్రస్తుతం జరుగుతున్న టీ20 సిరీస్ లో 2-1తో టీమిండియా ఆధిక్యంలో ఉంది. నేడు లక్నో వేదికగా నాలుగో టీ20లో ఇరు జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్ భారత్ నెగ్గితే సూర్య సేన సిరీస్ సొంతం చేసుకుంటుంది.

## సీఎస్‌కే ఘోర తప్పిదం చేసింది

**మాజీ కెప్టెన్, తమిళనాడు క్రికెటర్ క్రిష్ శ్రీకాంత్**

ఐపీఎల్ 2026 మినీ వేలంలో చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) ఘోర తప్పిదం చేసిందని మాజీ కెప్టెన్, తమిళనాడు క్రికెటర్ క్రిష్ శ్రీకాంత్ అన్నాడు. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్ అయిన ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను తీసుకోకపోవడమే సీఎస్‌కే చేసిన అతిపెద్ద తప్పిదమని అభిప్రాయపడ్డాడు. మంగళవారం అబుదాబి వేదికగా జరిగిన మినీ వేలంలో రూ.43.40 కోట్ల భారీ పర్స్ మనీతో బరిలోకి దిగిన సీఎస్‌కే 9 మంది ఆటగాళ్లను కొనుగోలు చేసింది. అనామక ఆటగాళ్లైన ప్రశాంత్ వీర్, కార్తీక్ శర్మలను రూ.14.20 కోట్ల చొప్పున కొనుగోలు చేసిన సీఎస్‌కే.. రాహుల్ చాహర్‌ను రూ.5.2 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. అకీల్ హోస్సేన్‌ను రూ.2 కోట్లకు కొన్న సీఎస్‌కే.. మాథ్యూ షార్ట్ (రూ.1.5 కోట్లు), సర్ఫరాజ్ ఖాన్(రూ.75 లక్షలు)లను తీసుకుంది. ముస్తాఫిజుర్ రెహ్మాన్ కోసం సీఎస్‌కే బాగానే ప్రయత్నించింది. రూ.9 కోట్ల వరకు బిడ్ వేసి వెనకడుగు వేసింది. దాంతో కేకేఆర్ రూ.9.20 కోట్లకు ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను చేజిక్కించుకుంది. అయితే ఈ నిర్ణయాన్ని క్రిష్ శ్రీకాంత్ తప్పుబట్టాడు. మతీష పతీరణను వదిలేసిన నేపథ్యంలో ముస్తాఫిజుర్‌ను కొనుగోలు చేయాల్సిందని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. అతని కోసం రూ.15 కోట్లు ఖర్చు చేసినా ఏం అయ్యేది కాదని తెలిపాడు. తుది జట్టులో లేని ఆటగాడి కోసం రూ.14.20 కోట్లు ఎందుకు ఖర్చు పెట్టారని అసహనం వ్యక్తం చేశాడు. 'ముస్తాఫిజుర్‌ను కొనుగోలు చేయకుండా సీఎస్‌కే తప్పిదం చేసింది. పతిరణను వదిలేసినప్పుడు ముస్తాఫిజుర్‌ను కొనుగోలు చేయాల్సింది. రూ.12, రూ.15 కోట్లకు వెళ్లినా బిడ్ వేయాల్సింది. అతనిలాంటి బౌలర్ సీఎస్‌కే చాలా అవసరం. వారికి ముస్తాఫిజుర్ లాంటి డెత్ బౌలర్ లేడు. భారీ ధరకు కొనుగోలు చేసిన కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్‌లో ఒకరు మాత్రమే తుది జట్టులో ఆడుతారు. అకీల్ హుస్సేన్‌ను తుది జట్టులో ఆడించాలి. అతను జడేజా తరహాలో బౌలింగ్ చేయగలడు. పవర్ ప్లేలో కూడా బౌలింగ్ చేయగలడు. నూర్ అహ్మద్‌పైనే పూర్తిగా ఆధారపడలేం. కాబట్టి అకిల్ హుస్సేన్‌ను తుది జట్టులో ఆడించాలి. ప్రశాంత్ వీర్ ఎలా బౌలింగ్ చేస్తాడో మనకు ఇంకా తెలియదు. ప్రస్తుతం సీఎస్‌కే కుర్రాళ్ల వైపు వెళ్తోంది. రాహుల్ చాహర్‌ను కొనుగోలు చేయడం కూడా మంచి ఎంపిక. అతను ఇప్పటికే తన సామర్థ్య ఏంటో చాటుకున్నాడు. ఐపీఎల్‌లో బాగా రాణించాడు. అతని తీరులో తేడా ఉండవచ్చు. కానీ చెడ్డ బౌలర్ కాదు. చెన్నైలాంటి పిచ్‌లపై అతను బాగా రాణిస్తాడు. గతంలో సీఎస్‌కేపై పంజాబ్ విజయంలో రాహుల్ చాహర్ కీలక పాత్ర పోషించాడు. రాహుల్ చాహర్, నూర్ అహ్మద్ బాగా బౌలింగ్ చేస్తే ప్రత్యర్థి జట్లు ఇబ్బంది పడుతాయి.చెన్నై వేదికగా జరిగే మ్యాచ్‌ల్లో ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగాలి. రాహుల్ చాహర్, అఖిల్ హుస్సేన్‌లతో పాటు నూర్ అహ్మద్‌ను ఆడించాలి. అన్షుల్ కాంబోజ్‌ను పక్కనపెట్టాలి. శివమ్ దూబేను మూడో పేసర్‌గా ఉపయోగించుకోవాలి.'అని క్రిష్ శ్రీకాంత్ చెప్పుకొచ్చాడు.

## ముంచిన పొగ మంచు


**భారత్, దక్షిణాఫ్రికా నాలుగో టీ20 రద్దు**

లక్నో: భారత్, దక్షిణాఫ్రికా మధ్య సిరీస్ విజేతను తేల్చే నాలుగో టీ20 పొగమంచు కారణంగా రద్దయింది. బుధవారం లక్నోలోని ఏకనా స్టేడియంలో జరగాల్సిన మ్యాచ్‌లో టాస్ కూడా పడకుండానే అంపైర్లు ఆటను రద్దు చేశారు. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6.30 గంటలకు టాస్ వేయాల్సి ఉండగా లక్నో నగరంపై దట్టమైన పొగమంచు ఆవహించింది.

మంచు ప్రభావంతో మైదానంలో కొద్ది దూరంలో ఉన్నవారు కూడా కనిపించలేకుండా మారింది. పరిస్థితిలో ఏమైనా మార్పు వస్తుందేమోనని 5 సార్లు పర్యవేక్షణకు వచ్చిన అంపైర్లు.. చివరికి రాత్రి 9.30 గంటలకు ఆటను రద్దుచేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సిరీస్‌లో ఇప్పటికే భారత జట్టు 2-1 ఆధిక్యంతో ఉంది. సిరీస్‌లో చివరిదైన ఆఖరి టీ20 ఈనెల 19న అహ్మదాబాద్‌లో జరుగుతుంది.

**గిల్‌కు గాయం.. సిరీస్‌కు దూరం!**

భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మరోమారు గాయం బారిన పడ్డాడు. నాలుగో టీ20 ప్రాక్టీస్ సందర్భంగా గిల్ కాలి బొటనవేలికి గాయమైంది. దీంతో లక్నో మ్యాచ్‌తో పాటు అహ్మదాబాద్ టీ20కీ గిల్ అందుబాటులో ఉండడని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.







# వారణాసి సెట్స్‌కు వస్తా

## రాజమౌళితో హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్


'వారణాసి' మూవీ సెట్‌కు వచ్చి షూటింగ్ చూడవచ్చా? అని హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరూన్ మన తెలుగు దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళిని కోరారు. కామెరూన్ దర్శకత్వంలో రూపొందిన విజువల్ వండర్ 'అవతార్'. ఇప్పటికే రెండు భాగాలు వచ్చిన ఈ మూవీ ఇప్పుడు ముచ్చటగా మూడో భాగం 'అవతార్: ఫైర్ అండ్ యాష్'డిసెంబరు 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'అవతార్' టీమ్ భారత్‌లో వినూత్నంగా ప్రచారానికి తెర తీసింది. దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి సహా కొంత మంది సినీ ప్రముఖులకు 'అవతార్ 3'ని చూపించారు. అనంతరం జేమ్స్ కామెరూన్, రాజమౌళి వీడియో కాల్ ద్వారా మాట్లాడుకున్నారు. సినిమా మేకింగ్, పాత్రల తీరు తెన్నుల గురించి ఒకరితోనొకరు చర్చించుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ విడుదల చేసింది. ఈ సందర్భంగా 'వారణాసి' మూవీ ప్రస్తుత పరిస్థితి గురించి రాజమౌళిని కామెరూన్ అడిగి తెలుసుకున్నారు. ఏడాదిగా షూటింగ్ జరుగుతోందని, మరో ఏడెనిమిది నెలల పాటు షూటింగ్ ఉందని రాజమౌళి వివరించారు. 'వారణాసి' షూటింగ్, సెట్స్ చూడాలని ఉందన్న కామెరూన్.. 'వచ్చి చూడవచ్చా' అని అడిగారు. ఈ మాటతో రాజమౌళి తెగ సంబరపడిపోయారు. 'మీరు రావడం ఎంతో సంతోషకరమైన విషయం. మా 'వారణాసి' టీమ్ మాత్రమే కాదు. మొత్తం సినిమా ఇండస్ట్రీ థ్రిల్ అవుతుంది' అని రాజమౌళి అనగా, 'పులులతో ఏదైనా షూట్ ప్లాన్ చేస్తుంటే చెప్పు' అని కామెరూన్ సరదాగా అనడంతో నవ్వులు వెల్లివిరిశాయి. సెకండ్ యూనిట్‌కైనా కెమెరా పట్టుకుని తాను కొన్ని సీన్స్ తీస్తానని కామెరూన్ చెప్పడం గమనార్హం. ఈ సందర్భంగా ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ.. 'అందరి కంటే ముందు 'అవతార్: ఫైర్ అండ్ యాష్' చూడటం నిజంగా ఎంతో సంతోషంగా ఉంది. మూవీలో సీక్వెన్స్, విజువల్స్, పాత్రలు తీర్చిదిద్దిన విధానానికి హ్యాట్సాఫ్. మూవీ చూస్తున్నప్పుడు థియేటర్‌లో చిన్న పిల్లాడిలా అయిపోయాను. బయటకు వచ్చాక కూడా అవే ఆలోచనలు వెంటాడాయి. ముఖ్యంగా కథానాయకుడు జేక్ నైతికంగా డైలమాలో పడే సన్నివేశాలు, అతడు తీసుకునే నిర్ణయాలు ఇందులో మరింత అద్భుతంగా చూపించారు. ఇంతకు మించి ఎక్కువ మాట్లాడితే స్పాయిలర్ అవుతుంది. అవతార్ ఫ్రాంఛైజీ వెండితెరకు ఒక బెంచ్ మార్క్ అని కొనియాడారు.






# ఓటీటీలో ఆకట్టుకుంటున్న కాంత

మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం కాంత . సెల్వమణి సెల్వరాజ్ డైరెక్షన్‌లో పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 14న విడుదలైంది. తమిళంలో కాంత చిత్రానికి సాలిడ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద తన ప్రభావాన్ని చూపించడంలో విఫలమైంది. తెలుగులో మాత్రం ఈ చిత్రాన్ని బోరింగ్‌గా ఫీలయ్యారు. ఈ మూవీ ఓటీటీలో మంచి రెస్పాన్స్ రాబట్టుకుంటోంది. ఇటీవలే పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ప్లిక్స్‌లో పలు ప్రధాన భాషల్లో విడుదలైంది కాంత. తాజా అప్‌డేట్ ప్రకారం కాంత చిత్రానికి ఓపెనింగ్ వీకెండ్‌లో 1.1 మిలియన్ వ్యూస్‌తో అద్భుతమైన స్పందన వచ్చింది. ఓటీటీలో విడుదలైన ఫస్ట్ వీకెండ్‌లో 1 మిలియన్ వ్యూస్ అధిగమించిన 17వ కోలీవుడ్ సినిమాగా కూడా నిలిచింది కాంత. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. సముద్రఖని, రానా కీలక పాత్రల్లో నటించారు. కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరించాడు.




# మరో హిందీ మూవీలో తమన్నా

తెలుగు, తమిళం, హిందీతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది తమన్నా భాటియా. ఈ ఏడాది తెలుగులో ఓదెల 2 చిత్రంలో లీడ్ రోల్‌లో నటించిన తమన్నా.. హిందీ రైడ్ 2లో కామియో రోల్‌లో మెరిసింది. తాజాగా మరో హిందీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది తమన్నా. షాహిద్ కపూర్ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఓ రోమియో చిత్రంలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీలో తృప్తి డిమ్రి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. విక్రాంత్ మస్సే, దిశా పటాని, నానా పటేకర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ భరద్వాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. బిగ్ బ్జడెట్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రం హిందీ నుంచి రాబోతున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఓ రోమియో షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ భామ ఖాతాలో ఇప్పటికే నాలుగు హిందీ సినిమాలుండగా.. షూటింగ్ దశలో ఉన్నాయి. మొత్తానికి బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది మిల్కీ బ్యూటీ.

# బాస్టియన్ రెస్టారెంట్‌పై కేసు


## హైకోర్టును ఆశ్రయించిన నటి శిల్పాశెట్టి

బాలీవుడ్ నటి శిల్పా శెట్టికి చెందిన ప్రముఖ రెస్టారెంట్ 'బాస్టియన్' బెంగళూరుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. అనుమతించిన సమయం కంటే ఎక్కువసేపు కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, అర్ధరాత్రి పార్టీలకు అనుమతించి నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను బెంగళూరు పోలీసులు ఈ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. అయితే రెస్టారెంట్‌పై కేసు నమోదు చేయడంపై శిల్పశెట్టి తీవ్రంగా స్పందించింది. ఈ రెస్టారెంట్‌పై వచ్చిన వార్తలను శిల్పా శెట్టి ఖండిస్తూ.. బుధవారం సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది.తమపై తమ రెస్టారెంట్‌పై వస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా నిరాధారమైనవని. కొందరూ కావాలనే తమ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఈ వివాదానికి క్రిమినల్ రంగు పూస్తున్నారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఇప్పటికే తాము హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశాము. ప్రస్తుతం ఈ విషయం కోర్టు పరిధిలో ఉన్నందున మీడియా సంస్థలు సంయమనం పాటించాలని ఆమె కోరారు. తాము దర్యాప్తుకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నామని, దేశ న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని' శిల్పా శెట్టి పేర్కొన్నారు. బిజినెస్‌మెన్ రంజిత్ బింద్రా స్థాపించిన 'బాస్టియన్ హాస్పిటాలిటీ'లో 2019లో పెట్టుబడి పెట్టిన శిల్పా శెట్టికి ఇందులో 50 శాతం భాగస్వామ్యం ఉంది. బెంగళూరులో అత్యంత ఖరీదైన పబ్‌లలో ఒకటిగా పేరొందిన బాస్టియన్, ఇప్పుడు వరుస వివాదాలతో వార్తల్లో నిలిచింది.



# రొమ్ము క్యాన్సర్ మహిళలకు ఆపరేషన్లు

## సోనూసూద్ మరో బృహత్తర కార్యక్రమం



ఇప్పటికే ఎంతోమందికి సాయం చేసి సోనూసూద్ రియల్ లైఫ్ హీరో అనిపించుకున్నారు. ఆపదలో, కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు. తాజాగా మరోసారి ఆయన తన మంచి మనసును చాటుకున్నారు. తన ఫౌండేషన్ ద్వారా దేశంలో ఉన్న 500 మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్ చికిత్స చేయించినట్లు వెల్లడించారు. దేశంలోని మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంపై మరింత దృష్టిసారించినట్లు తెలిపారు. మొత్తం 500కి పైగా శస్త్రచికిత్సలు జరిగాయి. 500 మంది మహిళలను మేం కాపాడగలిగాం. వారంతా కొత్త జీవితాన్ని పొందారు. వారి కుటుంబాల్లో ఆనందం నింపినందుకు నేనెంతో సంతోషంగా ఉన్నాను. సమష్టి కృషి ద్వారా మాత్రమే ఇలాంటి గొప్ప పనులు జరుగుతాయని సోనూసూద్ తెలిపారు. వైద్యులకు కూడా ఆయన కృతజ్ఞతలు చెప్పారు. ఇది ప్రారంభం మాత్రమేనని భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు చేయడంలో తానెప్పుడూ ముందుంటానని ఆయన తెలిపారు. సోనూసూద్ గొప్ప మనసు చాటుకోవడం ఇదే తొలిసారి కాదు. కరోనా సమయం నుంచి ఆయన తరచూ ఇలాంటి పనులు చేస్తూనే ఉన్నారు. సినిమాల్లో విలన్ పాత్రల్లో నటించిన ఆయన లాక్‌డౌన్ కాలంలో వలస కూలీలను తన సొంత ఖర్చులతో సొంతూళ్లకు పంపించడం ద్వారా రియల్ హీరోగా జనం హృదయాల్లో చోటు దక్కించుకున్నారు. ఆ తర్వాత నుంచి సోషల్ మీడియా వేదికగా తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ వారికి సాయం చేస్తున్నారు.

# యువ దర్శకుడు కేకే కన్నుమూత




టాలీవుడ్‌లో మరో విషాదం చోటుచేసుకుంది. యువ దర్శకుడు కిరణ్ కుమార్ (కేకే) బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. ఆయన మృతితో చిత్ర పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కిరణ్ కుమార్ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కేజేక్యూ: కింగ్.. జాకీ.. క్వీన్' చిత్రం ప్రస్తుతం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. తన కలల ప్రాజెక్ట్ థియేటర్లలోకి రావడానికి ముందే దర్శకుడు మరణించడం చిత్ర బృందాన్ని మరియు అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కిరణ్ కుమార్ 2010లో కింగ్ నాగార్జున హీరోగా తెరకెక్కిన 'కేడి' సినిమాతో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఆ సినిమా అప్పట్లో స్టైలిష్ మేకింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. నాగార్జున లాంటి పెద్ద హీరో తనకు అవకాశం ఇవ్వడం వల్లే తాను దర్శకుడిగా ఎదగగలిగానని కిరణ్ కుమార్ ఎప్పుడూ కృతజ్ఞతతో ఉండేవారు. ఇండస్ట్రీలో ఆయనను అందరూ 'కేకే' అని ఆప్యాయంగా పిలుచుకునేవారు. కాగా.. కిరణ్ కుమార్ మృతి పట్ల టాలీవుడ్‌కు చెందిన పలువురు నటీనటులు, దర్శకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రతిభావంతుడైన దర్శకుడిని కోల్పోవడం బాధాకరమని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463